

జీవించేందుకే మనిషి తినాలి
సమాజ సంక్షేమానికి జీవించాలి
- డాక్టర్ బిఆర్ అంబేద్కర్


REGD NO : APTEL 16144

# జన స్వరం

పవర్

అక్షరమే ఆయుధం

www.janaswaram.com



## పాఠకులకు విజ్ఞప్తి

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ :
janaswaramnews@gmail.com
మొబైల్ నెంబర్ : 7013030690



సంపుటి : 4 | సంచిక : 309 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 23-05-2025 | పేజీలు : 6


# సనాతన ధర్మం మతోన్మాదం కాదు

- ప్రతి జిల్లాకో బయోడైవరిటీ్స పార్కు..
- గ్రామానికో పల్లెవనం
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



**విజయవాడ, మే 22 (జనస్వరం) :** సనాతన ధర్మం మతోన్మాదం కాదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అటవీ భూములను ఆక్రమించుకునే వారు ఉన్నారు కానీ.. చెట్లు లేని ప్రాంతంలో మొక్కలు నాటాలనే ఆలోచన ఏ ఒక్కరిలోనూ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి కనిపిస్తే కొందరికి ఆక్రమించుకోవాలనిపిస్తుందని... కానీ తనకు మాత్రం వైవిధ్యం నెలకొల్పాలనిపిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి హాజరైన విశాఖపట్నానికి చెందిన భూషన్ అనే ప్రకృతి సేవకుడిని చూపిస్తూ 'మనకు సంబంధం ఉన్న ప్రదేశమైనా ఖాళీగా కనిపిస్తే అక్కడ విత్తనాలు, మొక్కలు నాటడం వృత్తిగా చేసుకున్న ఆయన్ని చూసి మనం నేర్చుకోవాలి' అన్నారు. ప్రతి జిల్లాలో ఒక బయోడైవర్సిటీ పార్క్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

**గ్రామాభివృద్ధిలో భాగస్వాములవ్వండి**

**'గ్రామాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం చాలా అవసరం** ఉన్నత స్థాయిలో ఉన్న స్థానికులు ఊరిని మర్చిపోకూడదు. గ్రామాభివృద్ధికి కృషి చేయాలి' అని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన 'మన ఊరికోసం మాటామంతీ' కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం రావివలస గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో ఆయన మాట్లాడారు. టెక్కలిలోని భవానీ థియేటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంగళగిరిలోని క్యాంప్ కార్యాలయం నుంచి ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. రావివలసలో ఎండలమల్లికార్జున స్వామి ఆలయానికి టూరిజం, దేవదాయశాఖ ద్వారా అవసరమైన నిధులు మంజూరు చేద్దామన్నారు. గ్రామంలో గ్రంథాలయం, రోడ్లు, కాలువలు, క్రీడామైదానాలు తదితర మౌలిక సదుపాయాల ఏర్పాటుకు రూ.15 కోట్లు మంజూరు చేస్తున్నట్టు వెల్లడించారు. త్వరలో మల్లికార్జునస్వామి ఆలయాన్ని సందర్శిస్తానని తెలిపారు.

**ఆధ్యాత్మిక కేంద్రంగా రావివలస: మంత్రి అచ్చెన్న**

మంత్రి, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు కూడా వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'వైసీపీ పాలనలో గ్రామాల అభివృద్ధి కుంటుపడింది. స్థానిక సంస్థల నిధులు ఇతర రంగాలకు మళ్లించారు. స్థానిక సంస్థలకు రావాల్సిన నిధులు, అధికారాల కోసం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేస్తున్న కృషి అభినందనీయం. రావివలసను ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సి ఉంది. జలజీవన్ మిషన్ ద్వారా నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తాం. ప్రకృతి వ్యవసాయాన్ని రెట్టింపు చేస్తాం' అని తెలిపారు. మాజీ జడ్పీటీసీ ఎల్.ఎల్.నాయుడు మాట్లాడుతూ.. 'రావివలసలో ఎండల మల్లికార్జున స్వామి ఆలయానికి వెళ్లే మార్గాన్ని విస్తరించాలి. గ్రామంలో ఇంటర్నల్ డ్రైనేజ్ సదుపాయం కల్పించాలి. అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించాలి. శ్మశానవాటికకు రోడ్డు, సీత పుష్కరిణికి మెట్లు సదుపాయం కల్పించాలి' అని కోరారు. దీనిపై పవన్‌కల్యాణ్ స్పందిస్తూ.. 'సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు చేద్దాం. డ్రైనేజ్ నిర్మాణాల్లో చాలాచోట్ల లోపాలున్నాయి. ఆ సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. శ్మశానవాటికకు సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలి' అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఆదేశించారు. ఈ మేరకు ఎండల మల్లన్న ఆలయానికి వెళ్లే రహదారి విస్తరణకు రూ.3 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

# రైస్ కార్డులకు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు

- గడువు ఏమీ లేదు.. తొందరపడొద్దు
- మ్యారేజ్ సర్టిఫికెట్, పెళ్లికార్డులు అక్కర్లేదు
- మంత్రి నాదెండ్ల



**అమరావతి, మే 22 (జనస్వరం) :** కొత్త బియ్యం కార్డులు, పాత వాటిల్లో మార్పులు, చేర్పుల కోసం స్వీకరిస్తున్న దరఖాస్తులకు గడువు లేదని, ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. అర్హత ఉన్న వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎవరూ తొందరపడాల్సిన అవసరం లేదని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రైస్ కార్డులు అందిస్తామని స్పష్టం చేశారు. కొత్త రైస్ కార్డులు, ఇతర సేవల కోసం వచ్చిన దరఖాస్తులన్నింటినీ 21 రోజుల్లోపే పరిశీలించి జూన్‌లో క్యూఆర్ కోడ్‌తో మొత్తం 4,24,59,128 మంది లబ్ధిదారులకు కొత్త స్మార్ట్ కార్డులను అందజేస్తామన్నారు. గురువారం విజయవాడలోని సివిల్ సప్లయిస్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. కొత్త రైస్‌కార్డులు, మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తులు సమర్పించేవారు మ్యారేజ్ సర్టిఫికెట్లు, పెళ్లి ఫోటోలను జత చేయాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. ఈ మేరకు సచివాలయాలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఉన్న రైస్ కార్డుల్లో పేర్ల తొలగింపు ప్రక్రియను డెత్ కేసులకు మాత్రమే పరిమితం చేశామని చెప్పారు. కార్డుల్లో పిల్లలను చేర్చడానికి వయసుతో సంబంధం లేదన్నారు. ఈనెల 7 నుంచి ఇప్పటి వరకు 5 లక్షలకుపైగా దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. రైస్ కార్డుల డేటాను గ్రామ, వార్డు సచివాలయాలకు అనుసంధానం చేయడంతో సర్వర్లు డౌన్ అయ్యాయని, దీనివల్ల దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియలో ఇబ్బందులు ఎదురవుతున్న మాట వాస్తవమేనని మంత్రి అంగీకరించారు. ప్రజలకు క్షమాపణలు చెప్పారు.

**మ్యాపింగ్ సమస్యలపై ఉన్నతస్థాయి కమిటీ :**

గత ప్రభుత్వం నిర్వహించిన హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ వల్ల దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, వీటిపై ముఖ్యమంత్రితో చర్చించిన తర్వాత ఒక ఉన్నతస్థాయి కమిటీని వేసి వారం రోజుల్లోనే ఈ సమస్యను పరిష్కరిస్తామని మంత్రి మనోహర్ హామీ ఇచ్చారు.


**పండుగలా రేషన్ పంపిణీ**

**రాష్ట్ర చౌక ధరల దుకాణదారుల సంఘం పిలుపు**

రాష్ట్ర ప్రభుత్వం రేషన్ వాహనాలను నిలిపివేసి చౌక ధరల దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా జూన్ 1న రేషన్ షాపులను అలంకరించి పండుగ వాతావరణంలో సరుకులు పంపిణీ చేయాలని రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘ అధ్యక్షుడు దివి లీలామాధవరావు డీలర్లకు పిలుపునిచ్చారు. గురువారం విజయవాడలోని కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈనెల25న అన్ని రేషన్ షాపుల వద్ద బ్యానర్లు కట్టి ప్రచారం చేయాలని సూచించారు..


# హస్తిన చేరిన చంద్రబాబు

- నేడు ఏడుగురు కేంద్ర మంత్రులతో భేటీలు
- రాష్ట్రాభివృద్ధికి సాయం కోరనున్న సీఎం
- రేపు నీతి ఆయోగ్ కౌన్సిల్ భేటీకి హాజరు



**న్యూఢిల్లీ, మే 22 (జనస్వరం) :** ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్న, ప్రతిపాదిత ప్రాజెక్టుల సత్వర అమలుకు కేంద్రప్రభుత్వం మద్దతు కోరేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. శుక్ర, శని వారాల్లో ఇక్కడే ఉంటారు. సీనియర్ కేంద్ర మంత్రులతో వ్యూహాత్మక సమావేశాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఏడుగురు కేంద్ర మంత్రులతో భేటీ కానున్నారు. శుక్రవారం ఉదయం తొలుత కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన వనరుల మంత్రి ప్రహ్లాద్ జోషీతో సమావేశమవుతారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు సహకారంపై చర్చిస్తారు. అనంతరం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలుస్తారు. వ్యూహాత్మక రక్షణ, ఏరోస్పేస్ కార్యక్రమాలపై చర్చిస్తారు. జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో భేటీలో పోలవరం ప్రాజెక్టు, రాష్ట్రంలో నీటి మౌలిక సదుపాయాల కల్పన, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల ప్రతిపాదనలపై మాట్లాడతారు. పరిశోధన, ఆవిష్కరణ, పారిశ్రామిక విజ్ఞాన సహకారాలపై సైన్స్ అండ్ టెక్నాలజీ (స్వతంత్ర) మంత్రి జితేంద్ర సింగ్‌తో చర్చిస్తారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తోనూ సీఎం సమావేశమవుతారు. రాష్ట్ర ఆర్థిక రోడ్ మ్యాప్ కోసం మెరుగైన ఆర్థిక కేటాయింపులు, మద్దతు కోరతారు. సాయంత్రం 4 గంటలకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన రాష్ట్రాల్లో కొత్త క్రిమినల్ చట్టాల అమలుపై జరిగే కీలక సమీక్షా సమావేశంలో చంద్రబాబు పాల్గొంటారు. రాత్రికి రైల్వే, ఎలక్ట్రానిక్స్-ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ అవుతారు. డిజిటల్ మౌలిక సదుపాయాలు, భవిష్యత్ సాంకేతిక ఆర్థిక వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్ పాత్రపై చర్చిస్తారు. శనివారం భారత్ మండపంలో జరిగే నీతి ఆయోగ్ 10వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశానికి సీఎం హాజరవుతారు.

## జీవితం - వి"చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

తేదీ : 23 మే 2025,
తిథి : బహుళ ఏకాదశి (రా.10:34వ.కు)
నక్షత్రం : ఉ/భాద్ర (సా.04:06వ.కు)
బ్రహ్మ ముహూర్తం : తె.04:02ల తె.04:50
రాహుకాలం : ఉ.10:28ల మ.12:04,
యమగండం : మ.03:18ల సా.04:54,
వర్జ్యకాలం : తె.02:49ల తె.04:27 24తా తె.03:01తె.04:39

## ఈ రోజు నమాజ్ వేళలు

తేదీ : 23 మే 2025,
ఫజర్ : తెల్లవారుజామున గం. 04:32
సూర్యోదయం : ఉదయం గం. 05:50
జొహార్ : మధ్యాహ్నం గం. 12:17
అసర్ : సాయంత్రం గం. 03:37
మఘ్రిబ్ : సాయంత్రం గం. 06:43
ఇష : రాత్రి గం. 08:01





జన స్వరం
**విలేకరులు కావలెను**
"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..
అసక్తి ఉన్న వారు సంప్రదించండి..
సాయి కల్యాణ్
ఫోన్ నెం : 7013030690
మేనేజింగ్ డైరెక్టర్, జనస్వరం మీడియా

# ఏపీ మద్యం కుంభకోణం.. నోరు విప్పిన జగన్!

## ఎడిటోరియల్

ఏపీలో మద్యం కుంభకోణం కుదిపేస్తోంది. ఇప్పటికే ఈ కేసులో కీలక అరెస్టులు జరుగుతున్నాయి. మరోవైపు ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ కూడా చేపడుతుంది. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో పెద్దలుగా వ్యవహరించిన నాయకులతో పాటు అధికారులు కూడా జైలుకు వెళ్లాల్సి వచ్చింది. ఈ మొత్తం ఎపిసోడ్లో సూత్రధారిగా భావిస్తున్న రాజ్ కసిరెడ్డి అరెస్టు తరువాత.. ఒక్కొక్కరు అరెస్ట్ అవుతూ వచ్చారు. ఇప్పుడు అందరి కళ్ళు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైపు ఉన్నాయి. మద్యం కుంభకోణంలో అక్రమంగా జగన్మోహన్ రెడ్డిని అరెస్టు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని స్వయంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ క్రమంలో ఈరోజు మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా మద్యం కుంభకోణం విషయంలో మాజీ ఎంపీ, ఒకప్పటి తన సహచరుడు విజయసాయిరెడ్డి పై సంచలన కామెంట్స్ చేశారు జగన్.

**మద్యం పాలసీపై చర్చ :**

వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మద్యం పాలసీ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు జగన్మోహన్ రెడ్డి. ప్రభుత్వమే నేరుగా మద్యం దుకాణాలు నడిపితే లంచాలు ఎందుకు ఇస్తారు అంటూ ప్రశ్నించారు. అమ్మకాలు ఎక్కువగా ఉంటే లంచాలు ఇస్తారా? లాభాలు తగ్గితే ఇస్తారా అని ప్రశ్నించారు. 2018లో టిడిపి అధికారంలో ఉంది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఆ ఏడాది కాలంలో 3.84 కోట్ల మద్యం కేసుల అమ్మకాలు జరిగితే.. 2.77 కోట్ల కేసుల బీర్లు అమ్మకాలు జరిగాయని జగన్ గుర్తు చేశారు. 2014 నుంచి 2019 మధ్య ప్రతి ఏటా మద్యం అమ్మకాలు పెరుగుతూ వచ్చే అన్నారు. వీటి వల్ల మద్యం కంపెనీలకు లాభం పెరిగి చంద్రబాబుకు లంచాలు ఇచ్చే పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు జగన్. అదే వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో మద్యం అమ్మకాలు తగ్గాయని.. పాము పెంచిన పనులే దానికి కారణమని.. మద్యం కంపెనీలకు ఆదాయం తగ్గి ప్రభుత్వానికి పెరిగిన విషయాన్ని గుర్తు చేశారు. మద్యం వినియోగం తగ్గడం వల్ల ప్రజా ఆరోగ్యానికి సైతం తాము మేలు చేశామని చెప్పుకొచ్చారు జగన్మోహన్ రెడ్డి.



**ప్రజారోగ్యంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం :**

అయితే జగన్మోహన్ రెడ్డి వాదన వింతలా ఉంది. మద్యం అమ్మకాలు తగ్గాయని చెబుతున్నారు.. వాటిపై పన్నులు విధించడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరిందని చెబుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అభియోగాలు మోపింది ప్రభుత్వ ఆదాయాన్ని కొల్లగొట్టారని కాదు. మద్యం కంపెనీల నుంచి భారీగా ముడుపులు తీసుకొని.. ప్రీమియం బ్రాండ్లను తొక్కిపెట్టి.. నాసిరకం మద్యం విక్రయాలు జరిపారన్నది ప్రధాన ఆరోపణ. మద్యం కంపెనీలతో పాటు డిస్టలరీల నుంచి కమీషన్లు దండుకున్నారు అన్నది అభియోగం. అయితే ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి కొత్త లాజిక్ ప్లే చేస్తున్నారు. ప్రజారోగ్యం కోసమే అప్పట్లో మద్యం ధరలు పెంచామని.. పనులు పెంచి మద్యం షాపులపై భారం మోపిన విషయాన్ని చెబుతున్నారు. ఇప్పుడు చంద్రబాబు సర్కార్ మద్యం వ్యాపారం ప్రైవేట్ మాఫియా చేతుల్లో పెట్టిందని ఆరోపణలు చేస్తున్నారు.

**అమ్ముడుపోయిన సాయి రెడ్డి.. :**

మరోవైపు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డిపై సైతం సంచలన వ్యాఖ్యలు చేశారు జగన్ మోహన్ రెడ్డి. రాజ్యసభ సభ్యుడిగా మూడున్నర ఏళ్ల పదవీ కాలం వద్దనుకొని.. చంద్రబాబుకు మేలు చేసేందుకు పదవి వదులుకున్న వ్యక్తి విజయసాయిరెడ్డి అన్నారు. తన రాజీనామాతో చంద్రబాబు కూటమికి మేలు జరుగుతుందని తెలిసి.. తన పదవిని అమ్ముకున్న వ్యక్తి అని సంచలన ఆరోపణలు చేశారు. అలాంటి వ్యక్తి లిక్కర్ స్కాంపై చేసే ఆరోపణలకు ఏం విలువ ఉంటుందని ప్రశ్నించారు. అసలు రాజ్ కసిరెడ్డికి బేవరేజెస్ కార్యకలాపాలతో సంబంధం ఏంటని ప్రశ్నించారు. లోక్‌సభలో వైసీపీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి, ఐఏఎస్ ధనుంజయ రెడ్డి, ఓఎస్డి కృష్ణమోహన్, మల్టీ నేషనల్ కంపెనీ డైరెక్టర్ బాలాజీ గోవిందప్పకు ఏం సంబంధం ఉంటుందని ప్రశ్నించారు. మొత్తానికి అయితే జగన్ అరెస్టు జరుగుతుందని భావిస్తున్న వేళ ఆయన మీడియా ముందుకు వచ్చి చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.



జమ్ము సాయి కల్యాణ్,
పొలిటికల్ అనలిస్టు,
మేనేజింగ్ డైరెక్టర్,
జనస్వరం మీడియా.

## ఓ శ్రామిక జీవి..!

ప్రకృతి వైపరీత్యమై కాటేసినా...
రుధిరాన్ని చెమటధారలుగా మార్చి
అధైర్య పడని నడకలతో
బీడుబడిన భూముల్లో
పచ్చని పైరులను పండించిన ఓ కృషీవల
నీకు వందనాలు ఓ శ్రామిక జీవి..!
అర్ధరాత్రి అపరాత్రి అనక రోగమొచ్చినా నొప్పులొచ్చినా..
చట్టమొచ్చినా పక్కమొచ్చినా..
పచ్చని పైరు గొంతెండిన ప్రతిసారి గొంతు తడుపుతూ
కోత కోసే సమయానికి అనుకోని అతిథిలా వడగళ్ల. వాన వచ్చి చేతికి వచ్చిన పంటను మింగేసినప్పుడు కన్నీళ్ళను కను రెప్పల మాటున దాచుకొని..
నివ్వురు గప్పిన నిప్పులా ఉన్న నీకు వందనాలు..
ఓ శ్రామిక జీవి..!
ఆరుగాలం కష్టించి..
పంటను కంటికి రెప్పలా కాపాడుకొని
పంటనంతా విపణికి తరలిస్తే
అధికారుల నిర్లక్ష్యంతో
లారీల కొరత, గన్నీ సంచుల కొరత వల్ల ధాన్యం కాంట అటకెక్కి కూర్చొగా..
విశాదమంతా గుండెలో ఒంపుకుని
కన్నీళ్ళను కను రెప్పల మాటున దాచుకొని..
నివ్వురు గప్పిన నిప్పులా ఉన్న నీకు వందనాలు
ఓ శ్రామిక జీవి..
పొలాల నడుమ.. పురుగుబూషిల నడుమ..
కాలం గడిపేస్తూ కష్టపడి తాను పస్తులు ఉంటూ..
మనకు అన్నం ముద్ద నోట్లోకి అందిస్తున్న
నీకు వందనాలు ఓ శ్రామిక జీవి..
ప్రకృతి వైపరీత్యమై కాటేసినా
మట్టినే నమ్ముకుని..
తొలకరి జల్లుకై ఎదురుచూసే
ధైర్యానికి నీకు వందనాలు ఓ శ్రామిక జీవి..
రైతే రాజుగా, రాజసంగా నిలవాలి
అలాంటి పరిస్థితులు మన కళ్ళముందే కదలాడాలి
అని కోరుకుంటు..



మంజుల పత్తిపాటి (కవయిత్రి),
మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్,
యాదాద్రి భువనగిరి జిల్లా,
తెలంగాణ.

# గ్రీవెన్స్‌కు సమస్యలతో క్యూ కట్టిన ప్రజలు

### స్పందించిన నేతలు

**మంగళగిరి, మే 22 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** ప్రజల సమస్యలు, దోపిడీలపై స్పందించి చర్యలు తీసుకునేందుకు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో పలు సమస్యలు వచ్చాయి. న్యాయం కోరుతూ ప్రజలు ప్రభుత్వం సలహాదారు ఎం.ఏ. షరీఫ్, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాల కృష్ణ, గుంటూరు జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబులకు వినతులు అందజేశారు.

**తండ్రి హత్యపై న్యాయం కోరుతూ కుమారుడు అర్జీ :**

నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం కొత్తమచ్చుమర్రి గ్రామానికి చెందిన ఎ.శివ ప్రసాద్ నాయుడు, 2012 డిసెంబరు 30న నంది కొట్కూరులో తన తండ్రిని వైసీపీ నాయకులు హత్య చేసి యాక్సిడెంట్‌గా మలిచారని ఆరోపించారు. ఈ ఘటనపై పునర్విచారణ జరిపి దోషులను శిక్షించాలని ఆయన కోరారు.

**స్వతంత్ర సమరయోధుడి స్థలంపై ఆక్రమణ.. ఫిర్యాదు :**

ఏలూరు జిల్లా భీమడోలు మండలం సూరప్పగూడెం గ్రామానికి చెందిన రామకోటేశ్వరరాజు మాట్లాడుతూ, తమ తండ్రి స్వతంత్ర సమరయోధుడిగా ఉండడంతో ప్రభుత్వం కేటాయించిన భూమిని స్థానికులు ఆక్రమించారని తెలిపారు. ఆక్రమణదారులను తొలగించి తమ పేరుగా భూమిపై పట్టా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

**కౌలుదారుని విన్నపం :**

తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం మోర్త గ్రామానికి చెందిన సూర్యచంద్రరావు, వనువులమ్మ దేవాలయ భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తుండగా గత సంవత్సరం పంట నష్టపోయిందని తెలిపారు. అందువల్ల కౌలు తగ్గించి భవిష్యత్తులో గుత్తాకు భూమి ఇవ్వాలని కోరారు.

**దౌర్జన్యానికి గురైన బాధితుడి ఫిర్యాదు :**



నంద్యాల జిల్లా బేతంచర్లకు చెందిన సయ్యద్ ఇద్రుస్ బాషా తనపై ఒక వ్యక్తి దౌర్జన్యానికి పాల్పడినట్లు, పైగా తప్పుడు కేసులు వేసి వేధింపులకు గురిచేస్తున్నట్లు పేర్కొన్నారు. పోలీసుల ద్వారా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

**వదిలేసిన భర్తపై మహిళ ఫిర్యాదు :**

ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన ఓ వివాహిత, తన భర్త అనుమానంతో ముగ్గురు పిల్లలతో కలిసి తన్నించి వదిలేశాడని పేర్కొంది. పొదిలిలో ఉన్న అత్తమామల ద్వారా భర్తను పిలిపించి పోలీసులు న్యాయం చేయాలని ఆమె గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చింది.

**పొలం విక్రయంలో మోసం – న్యాయం కోరిన కుటుంబం :**

అన్నమయ్య జిల్లా కలగడ మండలం కత్తివారిపల్లికి చెందిన డి. మల్లికాంతం కుటుంబం, తలపల మాధవ అనే వ్యక్తికి రూ.12 లక్షలు చెల్లించి పొలం కొనుగోలు చేశామని, బోరు కూడా వేయించామని తెలిపారు. కానీ డబ్బులు తీసుకున్న వ్యక్తి మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులు రిజిస్ట్రేషన్ చేయకపోగా, అదే భూమిని మరొకరికి తాకట్టు పెట్టారని వాపోయారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

**సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం : నేతలు**

అర్జీలు స్వీకరించిన నేతలు ప్రజల సమస్యలను తీవ్రంగా పరిగణనలోకి తీసుకొని వాటి పరిష్కారానికి తాము శ్రమిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

## "రాయలసీమ రంగస్థలి" ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి

### స్వామికి పట్టువస్త్రాలు సమర్పణ





**తిరుపతి, మే 22 (జనస్వరం) :** తిరుపతికి చెందిన "రాయలసీమ రంగస్థలి" ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. స్థానిక నాలుగు కాళ్ల మండపం వద్ద ఉన్న హనుమాన్ ఆలయంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి సర్వాంగ సుందరంగా అలంకరించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి కళాకారులతో కలిసి స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధైర్యానికి, విజయానికి ప్రతీక ఆంజనేయ స్వామి అని గుర్తు చేసారు. శ్రీ రామచంద్రుని బంటుగా, దాసభక్తికి అంజనేయ స్వామి నిదర్శనమని కొనియాడారు. తదనంతరం భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ అండ్ రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, పురోహితుడు సురేష్ స్వామి, రంగస్థలి కార్యదర్శి కెవెన్ రాజా, కళాకారులు నగర సంకీర్తన మండలి సభ్యులు విద్వాన్ కస్పా పద్మనాభం, మునినాథరెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, దేసునాగేశ్వరరావు, విజయభాస్కర్ రెడ్డి, కొండే చెంగారెడ్డి, బండ్లవీధి మురళి తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధేశ్వరం ప్రజా బహిరంగ సభ పోస్టర్ల ఆవిష్కరణ



**పులివెందుల, మే 22 (జనస్వరం) :** రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 31న సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన తొమ్మిదో వార్షికోత్సవ సంగమేశ్వర సభను జయప్రదం చేయాలని రాయలసీమ విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం పులివెందుల గాంధీ విగ్రహం ఎదుట పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్ .వి.యస్ రాష్ట్ర కార్యదర్శి మల్లేల జగదీష్ మాట్లాడుతూ ఏపీ అంటే అమరావతి పోలవరం కాదు అందరి ప్రదేశ్ అంటూ రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన అంశాలను అమలు చేయడంతో పాటు రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ, పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేసి సాగునీరు త్రాగునీరు అందించాలన్నారు, కడపలో ఎర్రచందన ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, రాయలసీమ వ్యాప్తంగా మూతపడిన పరిశ్రమలను తెరిపించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిగా రాయలసీమ త్రాగునీరు సాగునీటికే పరిమితం చేయాలని, కృష్ణా నది యాజమాన్య కర్నూల్‌లో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యువత భవిష్యత్తుకు విద్యాలయాలు పరిశ్రమలు అమరావతి ఫ్రీడంతో సీమ యువతకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. హంద్రీ నీవా తెలుగు గంగా గాలేరు నగరి వెలుగొండ ప్రాజెక్టులు మూడేళ్లలో పూర్తికి చర్యలు చేపట్టాలని, 1500 కోట్ల నిధులతో వచ్చే ఖరీఫ్ కు పది లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ చేపట్టాలని, ఉండ్రేవుల తుంగభద్రా జవు సమాంతర కాలువ వేదవతి ఎత్తిపోతల ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని, రాయలసీమలోని ప్రధాన కార్యాలను తరలింపును తక్షణమే నిలబదల చేయాలని డిమాండ్ చేశారు, శ్రీశైలం ప్రాజెక్టు పరిరక్షణకు లంజపుల్ మరమ్మతులతో పాటు కూడిక నివారణ శ్రీశైలం రిజర్వాయర్ జీవితకాలం పెంచడానికి సిద్దేశ్వరం అలుగు నిర్మాణం కై మే నెల 31న సంగమేశ్వరం దగ్గర జరగబోయే భారీ బహిరంగ సభకు ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, యువకులు, కవులు, రచయితలు మేధావులు, రైతులు, కార్మికులు తోపాటు సాధారణ ప్రజానీకం పాల్గొని పెద్ద ఎత్తున జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాసభల్లో కేవలం మాటలకే పరిమితం అవుతూ సమయాన్ని వృధా చేస్తున్నారని ఇప్పటికే కరువు సీమగా ఉన్న రాయలసీమలో రైతాంగం కొట్టుమిట్టాడుతుందన్నారు. రైతు ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించి సత్వర న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి పులివెందుల నాయకులు ఓబులరెడ్డి, వైసీపీ విద్యార్థి నాయకులు రాఘవేంద్రరెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, జయరాం పాల్గొన్నారు.

## పిఠాపురంలో భారీగా తిరంగా ర్యాలీ

### సింధూర్ ఉగ్రవాదాన్ని ఓడిస్తుంది



**పిఠాపురం, మే 22 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** పట్టణంలో శ్రీ కుక్కుటేశ్వర స్వామి ఆలయం నుండి బంగారమ్మ గుడి జంక్షన్ వరకు ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాకినాడ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి గంది కొండలరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా, ముఖ్య అతిథిగా జనసేన పార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావు, జనసేన నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు. దేశభక్తి సందేశాన్ని ప్రజల్లోకి వ్యాపింపజేయడమే లక్ష్యంగా ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ, "ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత మిలటరీ యావత్ ప్రపంచానికి మన శౌర్యాన్ని చాటింది. పాకిస్తాన్ తీవ్రవాదులకు ఇది కోలుకోలేని దెబ్బ. ఇకపై భారతదేశాన్ని చిన్నచూపుతో చూడడం వాళ్ల తరం కాదు," అని అన్నారు. అలాగే గండి కొండలరావు మాట్లాడుతూ, "మన దేశంలో 26మందిని చంపినవాళ్లు మీ ప్రధాని మోడీకి చెప్పుకోండి అన్నారు. మోడీకి చెప్పిన తర్వాత ఏం జరిగిందో ప్రపంచమే చూశింది. మాట్లాడకుండా పనిచెప్పే నేతగా మోడీ నిరూపించారు," అని వ్యాఖ్యానించారు. ర్యాలీ అనంతరం కొంతమంది రిటైర్డ్ ఆర్మీ జవాన్లను ఘనంగా సన్మానించి, సాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు, దాట్ల వెంకట సూర్యనారాయణ, రాజు తోట ఏడుకొండలు, పసుపులేటి సత్తిబాబు, చిట్టా మధు, ఓలేటి వెంకటేశ్వరరావు, కర్రి చిట్టిబాబు, పోసిన సత్యనారాయణ, కంబాల నాగేశ్వరరావు, అడబాల మోహన్రావు, ఎడ్ల ప్రభాకర్, దువ్వ వెంకటేశ్వరరావు, బీజేపీ పట్టణ నాయకులు, జనసేన నాయకులు సురవరపు సురేష్, చెల్లుబోయిన సతీష్, ఈస్ట్రన్ గోదావరి డెల్టా చైర్మన్ మురాలశెట్టి సునీల్, ఆంధ్రప్రదేశ్ శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్, ఆంధ్రప్రదేశ్ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ జయకృష్ణ, మార్కెట్ యాడ్ కమిటీ చైర్మన్ దేవి సూర్యప్రకాశ్, మార్నిడి రంగబాబు, గంజి గోవిందరాజు, నంద్యాల జాన్, పిల్ల దినేష్, మేళం రామకృష్ణ, గొల్లపల్లి వీరబాబు, సుబ్బు, బాలేపల్లి అనిల్, చెక్కపల్లి వినయ్, ఆగంటి ప్రభాకర్, రమ్య జ్యోతి, తోట నాగిని, భాను, పిల్ల లావరాజు, గరగ బాబి, కె. నాగేంద్ర, ముస్లిం సోదరులు ఎండి. అహ్మద్, షేక్ షంషుదీన్, వీర మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు. దేశ భక్తి నినాదాలతో పట్టణమంతా మార్మోగగా, ఈ ర్యాలీ ప్రజల్లో దేశభక్తి భావాన్ని మరింత బలంగా ప్రసారించింది.

# ఘనంగా అనకాపల్లి జిల్లా మినీ మహానాడు

- పాయకరావుపేట టీడీపీ కంచుకోట
- కష్టపడిన ప్రతీ కార్యకర్తకు న్యాయం జరుగుతుంది
- పాయకరావుపేట నియోజకవర్గంలో భారీగా ఉద్యోగావకాశాలు
- మినీ మహానాడులో హెూం మంత్రి అనిత



నక్కపల్లి, మే 22 (జనస్వరం) : తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లాలో మినీ మహానాడు ఘనంగా ప్రారంభమైంది. హెూం మంత్రి వంగలపూడి అనిత నాయకత్వంలో ఈ మహానాడు జరిగింది. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ఇంఛార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర, స్థానిక ఎమ్మెల్యేలు, టిడిపి ముఖ్యనాయకులు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి, పార్టీ జెండాను ఆవిష్కరించిన మంత్రులు అనిత, కొల్లు రవీంద్ర, ఇతర నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ మినీ మహానాడులో పలు తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదం పొందాయి. సుమారు పది వేల మంది టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెూం మంత్రి అనిత మాట్లాడుతూ పాయకరావుపేట నియోజకవర్గ ప్రజలు నాకు భారీ మెజారిటీ ఇచ్చి గెలిపించినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారని గుర్తు చేశారు. గత ఐదు సంవత్సరాలలో పాయకరావుపేటలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమం రెండూ సమాంతరంగా నడుస్తున్నాయని తెలిపారు. బల్క్ డ్రగ్ పార్క్, స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా వేలాది ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. పాయకరావుపేట అంటే టీడీపీ కంచుకోట అని చెప్పారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరగాల్సిందే అంటూ పార్టీ పట్ల నిబద్ధతను వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబును చూసి ప్రతి నాయకుడు ఎంతో నేర్చుకోవాలంటూ అభినందించారు. జగన్ మోహన్ రెడ్డి మీద విమర్శలు చేస్తూ, రాష్ట్ర ప్రజలు జగన్ వస్తే రాష్ట్రం అయోమయానికి లోనవుతుందని స్పష్టంగా చెప్పారు. ప్రజలు ఇటీవల చూపిన 'సినిమా' ఆయనకు బుద్ధి చెప్పే విధంగా ఉందని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పాయకరావుపేట నియోజకవర్గంలో ఉత్తమ సేవలందించిన నాయకులను, కార్యకర్తలను సన్మానించారు.

## ఉదయగిరి - దుర్గం రోడ్డు మార్గాన్ని పరిశీలన

- ఉదయగిరి దుర్గం రోడ్డు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుండి ౧ కోటి రూపాయలు నిధులు మంజూరు



**నెల్లూరు, మే 22 (జనస్వరం) :** ఉదయగిరి – దుర్గంను పర్యాటక కేంద్రంగా మార్చాలన్న ప్రతిపాదనల నేపథ్యంలో ఉదయగిరి దుర్గం రోడ్డు మార్గాన్ని సీసీ రోడ్డుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుండి కోటి రూపాయలు నిధులు మంజూరు కావడంతో గురువారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ డిఈ మణికుమార్, కూటమి పార్టీల నాయకులతో కలిసి పరిశీలించారు. కిలోమీటర్ దూరం ఉన్న రోడ్డు మార్గాన్ని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ ఉదయగిరి ప్రాంతం అభివృద్ధి చెందాలంటే పర్యాటకపరంగా ఉదయగిరి దుర్గం అభివృద్ధి చేయవలసిందన్నారు. ఇందుకోసం ఇప్పటికే పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ తో ఉదయగిరి దుర్గం అభివృద్ధి విషయమై పలుమార్లు చర్చించడం జరిగిందన్నారు. దీనికి మంత్రి అన్ని విధాల పర్యాటక అభివృద్ధి కోసం సహకరిస్తానని హామీ ఇచ్చాడన్నారు. కిలోమీటర్ దూరం ఉండే దుర్గం రోడ్డును ముందుగా సీసీ రోడ్డుగా మార్పు చేయనున్నామన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం నుండి త్వరలో నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఉదయగిరి ప్రాంతం అభివృద్ధి తన లక్ష్యమని ఎమ్మెల్యే కాకల సురేష్ తెలియజేశారు.

## వైభవంగా హనుమాన్ జయంతి శోభాయాత్ర

- జై శ్రీరామ్ నినాదాలతో దద్దరిల్లిన బుచ్చిరెడ్డిపాలెం పట్టణం
- హనుమ జయంతి బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**కోవూరు, మే 22 (జనస్వరం) :** శ్రీ హనుమంతుని భక్తి, బలం, ధైర్య సాహసాలకు ప్రతీకగా అభివర్ణిస్తూ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి హనుమాన్ జయంతి సందర్భంగా బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలో నిర్వహించిన హనుమాన్ జయంతి శోభాయాత్రలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డీఎల్ఎన్ఆర్ హై స్కూల్ నుంచి కోదండరామాలయం వరకు సాగిన బైక్ ర్యాలీలో ఎమ్మెల్యేతో పాటు పెద్ద సంఖ్యలో యువకులు ఉత్సాహంగా పాల్గొనగా, బుచ్చిపాలెం పట్టణం మొత్తం "జై శ్రీరామ్" నినాదాలతో మార్మోగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "శ్రీరాముని సేవలో హనుమంతుడు చూపిన అంకితభావం, విశ్వాసం నిజమైన భక్తికి కొలమానం. మనం ఏ మార్గంలో నడిచినా అది ధర్మమార్గం కావాలి" అని పిలుపునిచ్చారు. యువత హనుమంతుని ఆదర్శాలను అనుసరించి దేశం కోసం, సమాజం కోసం సేవచేయాలని సూచించారు. ఈ శోభాయాత్రలో బుచ్చి మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కౌన్సిలర్లు, బుచ్చి మండల టీడీపీ అర్బన్, రూరల్ అధ్యక్షులు గుప్తా శ్రీనివాసులు, బెజవాడ జగదీష్, టీడీపీ సీనియర్ నాయకులు హరికృష్ణ, ఎం.వి. శేషయ్య, సూరా శ్రీనివాసులు రెడ్డి, హిందూ చైతన్య వేదిక ప్రతినిధులు దర్శి బాల నరసింహారావు, గంజం పెంచల ప్రసాద్, పెట్లూరి కృష్ణయ్య, కుడుముల విజయ్ కృష్ణ, ఆలూరు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## పుల్లేటి కాలువ పనులు పూర్తి చేయాలి

**కాలువ విస్తరణ పనుల కోసం కమిషనర్‌ను కలిసిన ఎంపీ కేశినేని, ఎమ్మెల్యే గద్దె**




**విజయవాడ, మే 22 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** తూర్పు నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా నియోజకవర్గానికి చెందిన ప్రముఖ డ్రెయిన్ అయిన పుల్లేటి కాలువ విస్తరణ పనులపై గురువారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కలిసి విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రను కలిసి సమీక్ష నిర్వహించారు. 3వ డివిజన్ పరిధిలో గుణదల పంచాయతీ ఆఫీస్, పోస్టాఫీస్ ప్రాంతాల్లో పర్యటించిన అనంతరం స్థానిక సమస్యలపై సమీక్ష నిర్వహించిన నేతలు, పుల్లేటి కాలువ పనులు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉందని కమిషనర్‌కు వివరించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జరిగిన ఈ సమావేశంలో కాలువ విస్తరణ పనుల ప్రణాళికపై సమగ్రమైన చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ నగరంలో వీధి వ్యాపారులపై సర్వే కొనసాగుతున్నదని, సర్వే అనంతరం వారికి గుర్తింపు కార్డులు జారీ చేయనున్నట్టు తెలిపారు. రెడ్, గ్రీన్, అంబర్ జోన్లుగా విభజించి వృత్తినిర్వాహకుల కోసం స్థలాలు గుర్తిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే బంగారు కుటుంబాల ఎంపిక కోసం ప్రతి డివిజన్‌లో ఐదు కుటుంబాలను ఎంపిక చేయాలని ఎంపీ కేశినేని శివనాథ్ సూచించారు. ఈ సమావేశంలో టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, ప్రాజెక్ట్ ఆఫీసర్ పి. వెంకట నారాయణ, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ లత, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

## గన్నవరం నుంచి దేశ-విదేశాలకు కొత్త విమాన సర్వీసులు రాబోతున్నాయి

**ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)**



**గన్నవరం, మే 22 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో గురువారం ఎయిర్ పోర్ట్ అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిటీ చైర్మన్ ఎంపీ బాలశౌరి, వైస్ చైర్మన్ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), విమానాశ్రయ డైరెక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి, కృష్ణ జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర రావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా తదితరులు పాల్గొన్నారు. విమానాశ్రయ అభివృద్ధిపై వివిధ అంశాలను సమీక్షించిన అనంతరం ఎంపీ కేశినేని శివనాథ్ మీడియాతో మాట్లాడుతూ, గన్నవరం నుంచి త్వరలోనే దేశీయ, అంతర్జాతీయ గమ్యస్థానాలకు కొత్త విమాన సర్వీసులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. ప్రయాణికుల సౌకర్యాలు, భద్రతా ప్రమాణాలు, ట్రాఫిక్ నిర్వహణపై సమగ్రంగా చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిపారు. వివిధ ఎయిర్ లైన్స్ సంస్థలతో చర్చలు జరిపి కొత్త సర్వీసులు తీసుకురావాలని కమిటీ సూచించినట్టు తెలిపారు. ముఖ్యంగా దేశంలోని ఇతర నగరాలకూ విజయవాడ నుంచి కనెక్టివిటీ మెరుగుపరిచే లక్ష్యంతో కార్యాచరణ చేపట్టినట్లు వివరించారు. గత ప్రభుత్వ కాలంలో విమానాశ్రయ టెర్మినల్ పనులు ఆలస్యం అయినట్లు గుర్తుచేసిన ఎంపి కేశినేని, ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. సీఎం చంద్రబాబు సూచనల మేరకు గన్నవరం ఎయిర్ పోర్ట్ డిజైన్ మన సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశం ద్వారా విజయవాడ విమానాశ్రయ అభివృద్ధికి గణనీయమైన మార్గదర్శకాలు ఏర్పడ్డాయని కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు.

## లిక్కర్ స్కామ్‌లో జగన్ రెడ్డి జైలుకు వెళ్లటం ఖాయం

- ఆర్టీసీ మాజీ చైర్మన్ గోనె ప్రకాశ్ రావు
- ఎన్టీఆర్ భవన్‌లో మీడియా సమావేశం
- "డిజిటల్ పేమెంట్ ఎందుకు వాడలేదో జగన్ సమాధానం చెప్పాలి"



**విజయవాడ, మే 22 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** తన ముఖ్యమంత్రి పదవిలో ఉన్నప్పుడు వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్ మోహన్ రెడ్డి మద్యం అమ్మకాల పేరుతో "దేశంలో ఎక్కడా లేనంతగా దోపిడీకి పాల్పడ్డారని", లిక్కర్ స్కామ్ కేసులో ఆయన జైలుకు వెళ్లడం అనివార్యమని ఆర్టీసీ మాజీ చైర్మన్ గోనె ప్రకాశ్ రావు అన్నారు. విజయవాడలోని ఎన్టీఆర్ భవన్‌లో గురువారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మద్యం అమ్మకాల్లో డిజిటల్ పేమెంట్ వాడకపోవడం వెనుక జగన్ కుట్రే దాగి ఉంది. ఈ వ్యవస్థ ద్వారా వచ్చిన నోట్లన్నీ నేరుగా దోపిడీకి వాడారు. వేల కోట్ల రూపాయలు ప్రజల నుంచి, ప్రభుత్వ ఖజానా నుంచి కొల్లగొట్టారు. ఇప్పుడు ఒక్కొక్కరుగా నిందితులు నిజాలను ఒప్పుకుంటున్నారు," అన్నారు. మద్యం పాలసీపై మంత్రుల సంతకాలు ఉంటాయా అని జగన్ చేసిన వ్యాఖ్యలు ఆయన అవివేకానికి నిదర్శనమని గోనె అన్నారు. పాలసీని మంత్రి మండలమే ఆమోదిస్తుందని, అధికారులు కేవలం అమలు చేస్తారనే విషయాన్ని జగన్ లెక్కచేయకపోవడమే ఆయన దురుద్దేశాన్ని వెల్లడిస్తోందని విమర్శించారు. "విజయసాయిరెడ్డి స్వయంగా లిక్కర్ స్కామ్‌కి కర్త కర్మ క్రియ రాజ్ కసిరెడ్డి అని చెప్పడం గొప్ప విషయమే," అని గోనె అన్నారు.

**మంత్రి లోకేష్‌కు అభినందనలు :**

తాజాగా కేంద్రానికి చెందిన కీలక సమావేశాల అనంతరం ఉండవల్లిలో మంత్రి నారా లోకేష్‌ను కలిసి అభినందించినట్టు గోనె ప్రకాశ్ రావు తెలిపారు. "ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో రెండున్నర గంటలపాటు ముఖాముఖి చర్చలు జరిపిన ఏకైక నేత నారా లోకేష్‌గారే. ప్రధాని ఇప్పటివరకు ఎవరితోనూ అంత సమయం గడిపిన దాఖలాలు లేవు," అని ప్రశంసించారు. అలాగే నారా లోకేష్‌తో పలు రాజకీయ అంశాలపై చర్చించినట్టు చెప్పారు. ఈ ఆరోపణలు, వ్యాఖ్యల నేపథ్యంలో లిక్కర్ స్కామ్‌పై మరింత రాజకీయ ఉత్పాతం నెలకొనవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## కొయ్యలగూడెం పరిధిలో మూడు వాటర్ ట్యాంకులకు శంకుస్థాపన

**రూ.1.65 కోట్ల అంచనా వ్యయంతో మంచినీటి సమస్య పరిష్కారానికి శ్రీకారం**



**బర్రింకాలపాడు/కొయ్యలగూడెం, మే 22 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** ఏలూరు జిల్లా పోలవరం శాసనసభ నియోజకవర్గం పరిధిలోని కొయ్యలగూడెం పంచాయతీలో ప్రజల మంచినీటి సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ముమ్మరంగా చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో గురువారం స్థానికంగా మూడు వాటర్ ట్యాంకుల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల కోసం శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే, కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం మాట్లాడుతూ – "ప్రజల సమస్యలపై కూటమి ప్రభుత్వం సమగ్ర దృష్టి సారిస్తోంది. కొయ్యలగూడెం ప్రజల మౌలిక అవసరంగా మారిన మంచినీటి దాహార్తి తీర్చే దిశగా మూడు ట్యాంకుల నిర్మాణాన్ని ప్రారంభిస్తున్నాం. ఇందుకోసం రూ. 1.65 కోట్లు అంచనా వ్యయం కేటాయించాం," అని తెలిపారు.

కొల్లూరి విశ్వేశ్వరరావు విగ్రహావిష్కరణ :

ఈ కార్యక్రమం అనంతరం కొయ్యలగూడెం మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయాలకు భూములను దానం చేసిన విరాళదాత కొల్లూరి విశ్వేశ్వరరావు విగ్రహాన్ని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, మాజీ డిసిసిబి చైర్మన్ కరాటం రాంబాబు కలిసి ఆవిష్కరించారు. "నేటి రోజుల్లో గజం స్థలం కూడా ఇచ్చేందుకు వెనుకాడే పరిస్థితుల్లో ఎకరాల భూమిని ప్రభుత్వానికి దానం చేయడం గొప్ప ఉదాత్తత," అంటూ విశ్వేశ్వరరావు సేవాభావాన్ని ఎమ్మెల్యే ప్రశంసించారు. ఈ రెండు కార్యక్రమాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రాండ్ మాస్టర్స్ ప్రజ్ఞానంద, వైశాలి భాగస్వామ్యంతో 'ఎడ్యుగేమ్స్ ఇన్ఫినిటీ' ప్రారంభం



**హైదరాబాద్, మే 22 (జనస్వరం) :** భారత ప్రముఖ నోటుబుక్ బ్రాండ్ క్లాస్‌మేట్ విద్యలో వినూత్నతను ప్రోత్సహించే దిశగా మరో కీలక అడుగు వేసింది. విద్యార్థుల్లో ఆలోచనా నైపుణ్యాలను మెరుగుపరచేందుకు 'ఎడ్యుగేమ్స్ ఇన్ఫినిటీ' పేరిట కొత్త గేమిఫైడ్ నోటుబుక్‌ను గ్రాండ్ మాస్టర్స్ ఆర్. ప్రజ్ఞానంద్, ఆర్. వైశాలి భాగస్వామ్యంతో ప్రారంభించింది. ఈ నెల 24వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా 30 ప్రధాన నగరాల్లో ప్రచారం ప్రారంభం కానుంది. ప్రతిరోజూ పాల్గొనే విద్యార్థులకు వీఆర్ హెడ్‌సెట్‌తో పాటు అనేక ఉత్తేజకరమైన బహుమతులు గెలుచుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా, విజేతలకు హాంగ్‌కాంగ్ డిస్నీల్యాండ్ సందర్శించే అరుదైన అవకాశం కూడా కల్పించనున్నారు. ఈ గేమిఫైడ్ నోటుబుక్‌లో చివరి పేజీల్లో పజిల్స్‌ను ఆధునికీకరించి ఇంటరాక్టివ్ గేమ్‌లుగా రూపొందించారు. విద్యార్థులు ప్రతి రోజు ఆ పేజీలను స్కాన్ చేసి పజిల్‌ను ఆడే విధంగా వ్యవస్థను రూపొందించారు. ఇది విద్యను సరదాగా నేర్చుకునే విధానంగా మారుస్తుంది. ఈ సందర్భంగా గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద్ మాట్లాడుతూ, "ఎడ్యుగేమ్స్ ఇన్ఫినిటీ కేవలం ఆట మాత్రమే కాదు. ఇది మన మెదడును పదునుపరచే మేధో వ్యాయామం" అని తెలిపారు. గ్రాండ్ మాస్టర్ వైశాలి మాట్లాడుతూ, "చిన్నప్పుడు మేము పజిల్స్ ఆడుతూ పెరిగాం. ఇవి మన ఫోకస్, స్థైర్యాన్ని పెంచాయి. ఇప్పుడు అదే అవకాశాన్ని ఈ తరం విద్యార్థులకు అందించడంలో భాగస్వామ్యం కావడం గర్వంగా ఉంది" అని అన్నారు. వీరి తల్లిదండ్రులు మాట్లాడుతూ, "పిల్లల్లో చిన్నప్పటి నుంచి పజిల్స్ అలవాటు పెడితే మానసిక క్రమశిక్షణ వస్తుంది. క్లాస్‌మేట్ ఈ ప్రయాణాన్ని గుర్తు చేస్తోంది" అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఐటీసీ ఎడ్యుకేషన్ అండ్ స్టేషనరీ బిజినెస్ డివిజన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వికాస్ గుప్తా మాట్లాడుతూ, "విద్య అంటే ఆనందంగా ఉండాలి. ఇది జ్ఞానం, సృజనాత్మకత, సరదా ముడిపడిన ప్రక్రియ. ప్రగ్యానంద్, వైశాలి విజయం విద్యార్థులకు స్పష్టమైన మార్గదర్శనం" అని అన్నారు. ఈ ప్రచారంలో పాల్గొనే విద్యార్థులు ఎడ్యుగేమ్స్ లీడర్‌బోర్డ్లో పోటీ పడే అవకాశం కలదు. విజేతలకు ప్రతిరోజూ మెటా క్వెస్ట్ వీఆర్ హెడ్‌సెట్ వంటి బహుమతులు లభించనున్నాయి. ఇది విద్యను ఆసక్తికరంగా మార్చే విప్లవాత్మక ప్రయత్నంగా నిలుస్తోంది.

## "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం నిర్వహణ



**బొంరాస్‌పేట, మే 22 (జనస్వరం) :** మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో గురువారం "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" అనే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి పోలప్ప తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రానికి చెందిన డాక్టర్ టి.రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. అధిక రసాయనాలు వాడకం వల్ల నేల సారత్వం దెబ్బతినడమే కాకుండా పర్యావరణానికి కూడా హాని కలిగిస్తుందన్నారు. పంటల్లో తెగుళ్లు, పురుగుల నివారణలో శాస్త్రీయ సలహాలను పాటించాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయ కృష్ణ మాట్లాడుతూ రైతులు శాస్త్రవేత్తల సిఫారసు మేరకు ఎరువులను వినియోగించి పర్యావరణాన్ని రక్షించుకోవాలని, నీటి వనరులను రక్షించుకోవడంలో ప్రతి ఒక్కరికి బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింలు గౌడ్, ఏఈవోలు స్వాతి, వసీం, శైలజ, పవన్ యాదవ్, జగదీశ్వర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలి

**తడిసి మొలకెత్తిన వరి ధాన్యాన్ని పరిశీలించిన బీజేపీ నాయకులు**



**బొంరాస్‌పేట, మే 22 (జనస్వరం) :** మండల పరిధిలోని మెట్లకుంట, బొంరాస్‌పేట గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బీజేపీ మండల నాయకులు గురువారం పరిశీలించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా పండిన వరి తడిసి మొల కెత్తిన దృశ్యాలు అక్కడ కనిపించాయి. ఈ నేపథ్యంలో బీజేపీ మండల అధ్యక్షుడు శ్రావణ గౌడ్, సీనియర్ నాయకుడు బాబయ్య నాయుడు రైతులతో మాట్లాడి వారి బాధలను అడిగి తెలుసుకున్నారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే ప్రభు త్వం కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేదంటే రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ధాన్యపు మద్దతు ధర, భద్రపరిచే గోదాముల కొరత తదితర అంశాలను వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

## ఎంపీ సీఎం రమేష్ ఆధ్వర్యంలో భారీ తిరంగా ర్యాలీ

- భారత సైన్యానికి మద్దతుగా "ఆపరేషన్ సిందూర్" విజయోత్సవం
- హెూం మంత్రి అనిత, మంత్రి కొల్లు రవీంద్ర, ప్రజా ప్రతినిధుల పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణ



**అనకాపల్లి, మే 22 (జనస్వరం) :** భారత భద్రతా బలగాల సాహసాన్ని స్మరించుకుంటూ, ఉగ్రవాదంపై భారత్ నడిపిన విజయం "ఆపరేషన్ సిందూర్" కు మద్దతుగా అనకాపల్లి పట్టణంలో బుధవారం భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సీఎం రమేష్ ఆధ్వర్యంలో ఈ యాత్ర నిర్వహించారు. సన్ క్యాస్టిల్ హెూటల్ సెంటర్ నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు సాగిన ఈ దేశభక్తి ర్యాలీలో దాదాపు 5000 మంది పాల్గొన్నారు. ర్యాలీలో హెూం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా ఇంచార్జ మంత్రి కొల్లు రవీంద్ర, శాసన సభ్యులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, మహిళలు, యువత, సామాన్య ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. "భారత్ మాతాకీ జై", "జై జవాన్", "వందే మాతరం" నినాదాలతో గగనభేధించాయి. అనంతరం నిర్వహించిన సభలో మంత్రులు మాట్లాడారు. ఈ సందర్భంగా హెూం మంత్రి అనిత మాట్లాడుతూ దేశ భద్రత కోసం ప్రాణాలర్పించే సైనికుల గౌరవార్థం ఇలాంటి కార్యక్రమాలు యువతలో దేశభక్తిని నింపుతాయన్నారు. ఎంపీ సీఎం రమేష్‌కు మద్దతుగా ప్రజలు విపరీతంగా రావడం అభినందనీయమన్నారు. సభలో మాట్లాడుతూ ఎంపీ డాక్టర్ సీఎం రమేష్, "పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దాడికి ప్రతిస్పందనగా భారత సైన్యం నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' ద్వారా ఉగ్రవాద శిబిరాలను నాశనం చేయడం ప్రపంచానికి భారత్ శక్తిని చాటింది" అన్నారు. "మన ఆడపడుచుల సిందూరం తుడిచినవారికి సమాధానం ఇదే. తీవ్రవాదులు అంతమయ్యేంతవరకు ఈ ఆపరేషన్ ఆగదు," అని స్పష్టం చేశారు. అనకాపల్లి ప్రాంతానికి జాతీయ స్థాయిలో ఉన్న ప్రత్యేకతను గుర్తుచేస్తూ, "దేశ రక్షణలో కీలకమైన అణు జలాంతర్గాముల స్థావరం మన అనకాపల్లి ప్రాంతంలోనే ఉంది," అని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో భారతదేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు, పంచకర్ల రమేష్, సుందరపు విజయ్, పీల గోవింద సత్యనారాయణ, బత్తుల తాతయ్య బాబు, మల్ల సురేంద్ర, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, కూటమి నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, మాజీ సైనికుల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎంపీ సీఎం రమేష్, ర్యాలీని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## గాలాయగూడెం శ్రీ అభయాంజనేయ స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దంపతులు



**దెందులూరు, మే 22 (జనస్వరం) :** హనుమాన్ జయంతి సందర్భంగా నియోజకవర్గంలోని ఆలయాలు జై హనుమాన్ నామస్మరణతో మార్మోగాయి. గురువారం దెందులూరు మండలం గాలాయగూడెం గ్రామంలోని గౌడ వీధిలో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి వారిని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, రాధమ్మ దంపతులు దర్శించుకున్నారు. చింతమనేని దంపతులకు వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. చింతమనేని దంపతులు స్వామివారికి అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి కూటమి నాయకులు ఎమ్మెల్యే దంపతులను శాలువా, పూలదండలతో సత్కరించి స్వామివారి ప్రసాదం అందించారు.

## విద్యార్థుల ప్రగతికి గ్రంథాలయాలు తప్పనిసరి

### గ్రంథ పాలకులు దుగ్గిపోగు జాన్ బాబు





**పెదపాడు, మే 22 (జనస్వరం) :** విద్యార్థులు ప్రగతికి గ్రంథాలయాలు తప్పనిసరని పెదపాడు శాఖ గ్రంథాలయం అధికారి దుగ్గిపోగు జాన్ బాబు అన్నారు. పెదపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థిని విద్యార్థులచే ముందుగా "చిదంబర రహస్యం" అనే పుస్తకం నుండి "చదువురాని కవి"అనే కథను చదివించడం, కథలు చెప్పించడం, పుస్తక సమీక్ష చేయించారు. అనంతరం రిసోర్స్ పర్సన్ పూడి రవికుమార్ చే బ్రహ్మ సమాజ స్థాపకుడు, న్యాయవాది, రాజకీయవేత్త, ప్రముఖ సంఘసంస్కర్త "రాజా రామ్మోహన్ రాయ్" జయంతి సందర్భంగా ఆయన జీవిత చరిత్రను విపులంగా తెలియపరచి ఈయన ది:22/05/1772న బెంగాల్‌లోని రాధానగర్ అనే గ్రామంలో హుగ్లీ జిల్లాలో జన్మించారు. వారు హిందూ స్త్రీలకు "సతి" దురాచారం ద్వారా అన్యాయం జరగకుండా కాపాడటమే కాకుండా స్త్రీలకు వారి తండ్రి, భర్తల ఆస్తిలో హక్కు ఉండాలని కృషి చేసిన మొట్టమొదటి వ్యక్తి రామ్మోహన్ రాయ్ అని కొనియాడారు. 1823లో "హిందూ స్త్రీల హక్కులపై దురాక్రమణ" అనే గ్రంథం కూడా రాసి సంచలనం సృష్టించారు. ఢిల్లీ చక్రవర్తి ఆయన సేవలకు మెచ్చి "రాజా"అనే బిరుదు నిచ్చారు, అప్పటినుండి ఆయన "రాజా రామ్మోహన్ రాయ్" అయ్యాడని తెలియజేశారు. తరువాత రిసోర్స్ పర్సన్ వి. సత్యనారాయణ స్పోకెన్ ఇంగ్లీష్‌లో భాగంగా కూరగాయలను ఇంగ్లీషులో ఏమని పిలుస్తారో వాటిని తెలుగులో ఏమని పిలుస్తారో వాటి అర్థాలను విద్యార్థులకు వివరించారు. ఆటవిడుపులో భాగంగా వాలి బాల్ ఆట గురించి వివరించి ఆడించారు. ఈ కార్యక్రమానికి 12 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అంతయు గ్రంథాలయ అధికారి దుగ్గిపోగు జాన్ బాబు ఆధ్వర్యంలో జరిగాయి.

## పుస్తక పఠనంతో విద్యార్థులు నైపుణ్యాలకు మెరుగులు





**దెందులూరు, మే 22 (జనస్వరం) :** పుస్తక పఠనం ద్వారా విద్యార్థుల నైపుణ్యాలకు మెరుగులు దిద్ద వచ్చని పోతునూరు గ్రంథ పాలకులు గురిందపల్లి రాంబాబు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు నీతి కథలు చెప్పించడం, రాయించడం వంటివి నేర్పించారు. విద్యార్థులకు రిసోర్స్ పర్సన్ డి ,సురేష్ బాబు స్పోకెన్ ఇంగ్లీష్ ను నేర్పించారు. తదుపరి చదరంగం, ఖో ఖో, క్యారమ్స్ వంటి ఆటలు విద్యార్థులచే ఆడించారు. విద్యార్థులకు స్నాక్స్ అందించారు. ఈ కార్యక్రమం గ్రంథ పాలకులు గురిందపల్లి రాంబాబు ఆధ్వర్యంలో జరిగాయి.

## భక్తుల సౌకర్యార్థం.. దేవస్థానం నిర్వహిస్తున్న వివిధ పథకాలకు విరాళం..



**శ్రీశైలం, మే 22 (జనస్వరం) :** శ్రీశైలమహాక్షేత్రంలో శ్రీశైలదేవస్థానం భక్తులసౌకర్యార్థం నిర్వహిస్తున్న వివిధ పథకాలకు గురువారం యం.శివాజీ హైదరాబాద్ వారు అన్నప్రసాదవితరణ కు రూ.200,000లు, గోసంరక్షణకు రూ.200,000లు, ప్రాణదాత ట్రస్ట్ కురూ.1,00,000ల విరాళాన్ని పర్యవేక్షకులు టి.హిమబిందుకు అందజేశారు. దాతలకు విరాళానికి సంభందించిన రసీదుతో పాటు స్వామి వార్ల శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు.

# పుల్లేటి కట్ట డ్రెయిన్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం

### ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్నీ)



**విజయవాడ, మే 22 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** తూర్పు నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలలో ఒకటైన పుల్లేటి కట్ట డ్రెయిన్, రోడ్డుల సమస్యకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపుతుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ చెప్పారు. గురువారం, 3వ డివిజన్ పరిధిలోని గుణదల పంచాయితీ కార్యాలయం, పోస్టాఫీస్ ప్రాంతాల్లో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామమోహన్ కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ శాఖ అధికారులతో కలిసి పుల్లేటి కట్ట రోడ్డును పరిశీలించారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ, చిన్నపాటి వర్షంలోనే నగరంలోని రహదారులపై నీరు నిలిచిపోతున్నదని, ఈ సమస్యకు సమగ్ర పరిష్కారం అవసరమని పేర్కొన్నారు. 2014లో సీఎం చంద్రబాబు విజయవాడ డ్రెయినేజ్ వ్యవస్థ మెరుగుపరచడానికి కేంద్రం నుంచి సుమారు రూ.450 కోట్లు స్ట్రామ్ వాటర్ నిధులుగా అందించారని, ఆ నిధులతో కొన్ని ప్రాంతాల్లో పనులు చేపట్టారని తెలిపారు. అయితే, 2019 ఎన్నికల తరువాత అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం ఆ నిధులను వినియోగించుకోకపోవడం వల్ల సమస్యలు ఎక్కువైందని విమర్శించారు. పుల్లేటి కట్ట ప్రాంతంలో చిన్న వర్షానికి కూడా కాలనీలు జలమయం అవుతున్నాయని, గత ఐదు సంవత్సరాల పాటు వైసీపీ ప్రభుత్వం విజయవాడ అభివృద్ధికి పట్టించుకోలేదని అభిప్రాయపడ్డారు. కూటమి ప్రభుత్వం విజయవాడ నగరంలోని డ్రెయినేజ్ వ్యవస్థను మెరుగుపర్చేందుకు మళ్లీ చర్యలు ప్రారంభించిందని, పుల్లేటి కట్ట డ్రెయిన్‌ను విస్తరించడం, రోడ్డును రెండు వైపులా విస్తరించడం ద్వారా సమస్యకు శాశ్వత పరిష్కారం కనిపించనున్నట్లు తెలిపారు. ఈ కోసం కాలనీలోని కొన్ని రహదారులను తాత్కాలికంగా మూసివేయాల్సి వచ్చే అవకాశం ఉన్నదని, స్థానికులు సహకరిస్తారని తెలిపారు. ఇసిఎస్ఐ ఆసుపత్రి నుండి రమేష్ హాస్పిటల్ వరకు డ్రెయిన్ నిర్మాణం చేపడతామని, దీని ద్వారా కాలుష్య నీరు నిల్వ అవకుండా, ఆరోగ్య సంబంధ సమస్యలు తగ్గుతాయని ఎంపీ చెప్పారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ, 2014 లో సీఎం చంద్రబాబు స్ట్రామ్ వాటర్ నిధులతో డ్రెయినేజ్ వ్యవస్థ మెరుగుపరచడానికి చర్యలు తీసుకొని పనులు ప్రారంభించారని తెలిపారు. నగరంలోని డ్రెయిన్ సమస్య పరిష్కారానికి మళ్లీ ప్రభుత్వ ప్రతిబద్ధత వ్యక్తం చేసినట్లు తెలిపారు. పుల్లేటి కట్ట డ్రెయిన్ విస్తరణతో సమస్యకు శాశ్వత పరిష్కారం వచ్చే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అతని ప్రకారం, మున్సిపల్ కమిషనర్, ఇతర శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి రోడ్డు, డ్రెయిన్ సమస్యపై చర్చించి సమగ్ర పరిష్కార మార్గాలను కనుగొంటామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దేవినేని అపర్ణ, ముమ్మనేని ప్రసాద్, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి దేవినేని చందు, టీడీపీ సీనియర్ నాయకులు బొప్పన భవనకుమార్, శాలివాహన కమ్మరి సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పెరిపి ఈశ్వర్, ఎన్టీఆర్ జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు చలసాని రమణ, ఇతర నాయకులు దాసరి గాబ్రియేల్, ఎలయంచిలి పండు, రగని సాయి, భాస్కర్, జనసేన నాయకులు గుత్తికొండ కృష్ణమోహన్, సిటీప్లానర్ సంజయ్ రత్నకుమార్, ఏసీపీ మోహనబాబు, ఈఈ సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు



**పులివెందుల, మే 22 (జనస్వరం) :** సింహాద్రిపురం మండలం నిడి వెలగల ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామి వారికి మహా సంప్రోక్షణ గణపతి పూజ శ్రీ ఆంజనేయ స్వామి వారికి పంచామృతాభిషేకం నాగవల్లిక ఆకు పూజ సింధూర పూజ ఆలయ ప్రాకారోత్సవం మొదలైన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలలో ఆలయ ధర్మకర్త లక్ష్మీనారాయణ రెడ్డి కమల్ నాథ్ రెడ్డి దంపతులు జోగి రెడ్డి దంపతుల పాల్గొన్నారు. హిమకుంట్ల గురిజాల కసుమూరు సింహాద్రిపురం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి పునీతులయ్యారు. పూజా కార్యక్ర మాలు అన్ని ఆలయ ప్రధాన అర్చకులు మధుసూదన్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.


## భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి వేడుకలు



**పులివెందుల, మే 22 (జనస్వరం) :** కడప జిల్లా వ్యాప్తంగా గురువారం హనుమద్ జయంతి వేడుకలు అత్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను పురస్కరించుకుని జిల్లాలోని అన్ని ఆంజనేయ స్వామి ఆలయాలు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. గురువారం వేకుజామున నుంచే స్వామివారికి అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిక్కిరిసాయి. పులివెందులలో ఎంపీ అవినాష్ రెడ్డి, వేంపల్లిలో మాజీ రాజ్యసభ సభ్యులు తులసిరెడ్డీలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహంచారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్ తులసి రెడ్డి మాట్లాడుతూ హనుమజ్జయంతి హిందువులకు అతి పవిత్రమైన, ముఖ్యమైన పండుగ అన్నారు. అతి ప్రాచీన కాలం లో వైశాఖ మాసం, బహుళ దశమి నాడు, పూర్వ భాద్రా నక్షత్రంలో తిరుమల ఏడు కొండల్లో ఒకటైన అంజనాద్రి కొండమీద వాయుదేవుని వరప్రసాదంతో అంజనా దేవి, కేసరి అనబడు వానర పుణ్య దంపతులకు హనుమంతుడు జన్మించాడని పరాశర సంహిత,శివ మహాపురాణం చెబుతున్నాయి. హనుమంతుడిని ఆంజనేయుడని, అంజనీ పుత్రుడని, వాయుసుతుడని, పవన కుమారుడని కూడా పిలుస్తారు. ప్రసన్నాంజనేయుడుగా, వీరాంజనేయుడుగా, అభయాంజనేయుడుగా, పంచముఖ ఆంజనేయుడుగా వివిధ రూపాలలో దర్శనమిస్తాడు. హనుమంతుడు కార్య సాధకుడు, కార్య దక్షుడు, కార్య శూరుడు. అచంచల భక్తి,విశ్వాసాలకు మారుపేరు. అతులిత బలశాలి. సాహస వంతుడు. మహా పండితుడు, బుద్ధిశాలి. సమయ స్ఫూర్తికి ప్రతిరూపం. హనుమంతుడు లేకపోతే రామాయణమే లేదని తులసిరెడ్డి అన్నారు.

## వైసీపీ సర్పంచులంతా టీడీపీలోకి జంప్

### చంద్రగిరి నియోజకవర్గంలో వైసీపీకి బిగ్ షాక్‌కే






**తిరుపతి, మే 22 (జనస్వరం) :** చంద్రగిరి నియోజకవర్గంలోని రూరల్ మండలానికి చెందిన వైసీపీ సర్పంచులు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు తిరుపతి రూరల్ మండలానికి చెందిన చిగురువాడ, కె.సి.పేట, పద్మావతిపురం సర్పంచులను, కార్యకర్తలను టీడీపీ కండువా కప్పి ఎమ్మెల్యే నాని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సర్పంచులు మీడియాతో మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల వైసీపీ ప్రభుత్వ పాలనలో పంచా యతీలు ఏమాత్రం అభివృద్ధి చెందలేదని ఆవేదన చెందారు. అందుకు పాలకులే కాకుండా నియోజ కవర్గంలో కుటుంబ పాలన పెత్తనం చేయడం పెద్ద సమస్యగా మారిందన్నారు. అంతా చెవిరెడ్డి కుటుంబ పాలన కొనసాగేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 10 నెలల్లోనే చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పంచాయతీలలో చేస్తున్న అభివృద్ధి అమోఘమని అభినందించారు. గత వైసీపీ ప్రభుత్వ పాలకులకు.. ఇప్పుడు కూటమి ప్రభుత్వ పాలకులకు మధ్య తేడాను స్వయంగా చూసామని వెల్లడించారు. కాబట్టి టీడీపీలో చేరి పంచాయతీలను, ప్రజలను అభివృద్ధి వైపు నడిపిం చుకుంటామన్నారు. టీడీపీకి విధేయతగా వ్యవహరిస్తామని పార్టీలో చేరిన సర్పంచులు ప్రకటిం చారు. ఇప్పుడు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పాలనలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని, సజావు పాలన కొనసాగిస్తున్నారని ప్రసంశించారు. తిరుపతి రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సమక్షంలో వైసీపీ నుండి వచ్చిన సర్పంచులు.. వారి అనుచరుగణానికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, సర్పంచులు, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైఎస్ షర్మిలారెడ్డి అరెస్టు దుర్మార్గపు చర్య

### పీసీసీ డెలిగేట్ వేలూరు శ్రీనివాస్ రెడ్డి



**పులివెందుల, మే 22 (జనస్వరం) :** ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డిని అరెస్టు చేయడం దుర్మార్గపు చర్య అని పీసీసీ డెలిగేట్ శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. విశాఖలో కార్మికులకు మద్దతుగా షర్మిల రెడ్డి చేపట్టిన చేపట్టిన దీక్షను పోలీసులు భగ్నం చేయడానికి ఆయన ఖండించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో నిరసన చేసే హక్కు భారత రాజ్యాంగం కల్పి ంచిందన్నారు. ఆ హక్కును కాల రాయడం అప్రజాస్వామిక చర్య అన్నారు. కార్మికులకు అన్యాయం జరిగితే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదన్నారు. ఈ క్రమంలో విశాఖలో కార్మికులకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ దీక్ష చేపట్టడం తప్పా అని ప్రశ్నించారు. షర్మిల రెడ్డి చేపట్టిన ఉక్కు దీక్షను భగ్నం చేయడం సహేతుకం కాదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ వద్ద రాత్రి తొమ్మిది గంటల సమయంలో పోలీసులు ఒక్కసారిగా దీక్ష శిబిరం చుట్టు ముట్టి. తీవ్రవాదుల కంటే ఘోరంగా ఆమెను అరెస్టు చేసి గాజువాక పోలీస్ స్టేషన్ తరలించడం అప్రజా స్వామికమని వెల్లడించారు. శాంతియుతంగా విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల, కార్మికుల సమస్యల మీద ఆమరణ నిరాహార దీక్ష చేపడితే! ప్రభు త్వం పోలీసులు చేత దీక్షను భగ్నం చేసి షర్మిల రెడ్డిని అరెస్ట్ చేయడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శ నమన్నారు. విశాఖ ఉద్యోగులు, కార్మికులకు మద్దతుగా చేపట్టిన షర్మిలా రెడ్డికి రాజకీయాలకతీతంగా ప్రజలందరూ సంఘీభావం తెలపాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి నియంత పాలనకు అడ్డుకట్ట వేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇప్పటికైనా షర్మిలా రెడ్డిపై బనాయించిన అక్రమ కేసు ఎత్తివేయాలని, అందుకు బేషరుతుగా క్షమాపణ చెప్పాలని శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు.

## సీఐటీయూ తిరుపతి నూతన కమిటీ ఎన్నిక

### అధ్యక్ష, కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం, మాధవ కృష్ణ






**తిరుపతి, మే 22 (జనస్వరం) :** సీఐటీయూ తిరుపతి నగర కమిటీ సమావేశం గురువారం యశోద నగర్ లోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా కోశాధికారి కెఎన్ఎన్ ప్రసాదరావు హాజరయ్యారు. ఆయన ఈ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ జూలై 9వ తేదీ జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని, లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా జరుగుతున్న సమ్మెలో యావత్ కార్మిక వర్గం పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమ్మె జయప్రదం కోసం అన్ని యూనియన్ల జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించాలన్నారు. సమ్మె నోటీసులు ఇవ్వాలని అన్ని యూనియన్లకు పిలుపునిచ్చారు

**నూతన కమిటీ ఎన్నిక :**

సీఐటీయూ నగర అధ్యక్షుడిగా టి. సుబ్రమణ్యం, నగర ప్రధాన కార్యదర్శిగా మాధవ కృష్ణలను సమావేశంలో హాజరైనటువంటి కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, సీఐటీయూ నాయకులు కే.వేణుగోపాల్, బుజ్జి, చిన్న, తంజావూరు మురళి, ఆనంద్, రఘు, వాసు, శేషయ్య, బాదుల్లా, రమేష్, శ్రీరాములు, కిరణ్, బాబు తదితర సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పిల్లలను తీర్చిదిద్దే బాధ్యత అంగన్వాడీలదే

### పెదపాడు ప్రాజెక్టు ఏసీడీపీఓ రాజశేఖర్






**దెందులూరు, మే 22 (జనస్వరం) :** పిల్లలకు మంచి నడవడిక, ఆటపాటలు నేర్పించాల్సిన పూర్తి బాధ్యత అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేసే సిబ్బందిపైనే ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఆ పిల్లలను సమా జానికి పనికొచ్చే పౌరులుగా తీర్చిదిద్దడానికి మొదటి మెట్టుగా కృషి చేయాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ పెదపాడు ప్రాజెక్టు ఎ సీడీపీఓ సునీల్ రాజశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని పలు అంగన్వాడి కేంద్రాలను పెదపాడు ఏసీడీపీఓ రాజశేఖర్ పరిశీలించారు. చల్ల చింతలపూడిలోని గౌడీ వీధి కేంద్రంలోని కోడ్ నెంబర్ 127ను పరిశీలించి చిన్నారులను పలు ప్రశ్నలు అడిగారు. చిన్నారులు చక్కగా ప్రశ్నలకు సమాధానం చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. దెందులూరు సెక్టార్ సూపర్వైజర్ చిట్టమ్మ అంగన్వాడీ కార్యకర్త సహాయక సిబ్బంది పాల్గొన్నారు.

## పాయకరావుపేట టీడీపీ టౌన్ అధ్యక్షునిగా యాళ్ల వరహాలబాబు

### జిల్లా మినీ మహానాడులో హెూం మంత్రి అనిత ప్రకటన

**పాయకరావుపేట, మే 22 (జనస్వరం) :** టీడీపీ పాయకరావుపేట పట్టణ అధ్యక్షుడిగా యాళ్ల వరహాలబాబు నియమితులయ్యారు. గురువారం అడ్డరోడ్డులో నిర్వహించిన జిల్లా స్థాయి మినీ మహానాడులో హెూం మంత్రి వంగలపూడి అనిత ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. టీడీపీ ఆవిర్భావం నాటి నుంచి పార్టీతో నిబద్ధతతో పని చేస్తున్న వరహాలబాబు, గతంలో పాయకరావుపేట పాండురంగ స్వామి ఆలయ చైర్మన్‌గా సేవలందించారు. పార్టీ అభివృద్ధికి తన బాధ్యతలను నిష్ఠగా నిర్వర్తిస్తానని, పట్టణంలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని వరహాలబాబు ఈ సందర్భంగా చెప్పారు. పార్టీకి అనుభవం ఉన్న నాయకుడికి అధ్యక్ష పదవి లభించడం పాయకరావుపేట టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపిందిగా కనిపిస్తోంది.

# దమ్ము, ధైర్యం ఉంటే ఎమ్మెల్యే జగన్ నా సవాల్ స్వీకరించాలి

**ఎంపీ కేశినేని శివనాథ్**



**ఇబ్రహీంపట్నం, మే 22 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** ఎన్టీఆర్ జిల్లా మినీ మహానాడులో ఎంపీగా తొలిసారి హాజరైన కేశినేని శివనాథ్ (చిన్ని) పులివెందుల ఎమ్మెల్యే జగన్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. "లిక్కర్ స్కామ్ ఎవరి హయంలో జరిగింది? ధైర్యం ఉంటే జగన్ సమాధానం చెప్పాలి" అంటూ ఆయన సూటిగా ప్రశ్నించారు. తాను ఎంపి స్థాయిలో ఉన్నవాడినని, జగన్ తన స్థాయికి సరిపోడని స్పష్టం చేశారు. అయితే, జగన్ వ్యాఖ్యల కారణంగా తాను స్పందిస్తున్నానని పేర్కొన్నారు. తాను కేవలం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, టీడీపీ నేతలు, కార్యకర్తలు, ఎన్టీఆర్ జిల్లా ప్రజలకు మాత్రమే జవాబుదారీనని తెలిపారు. గుంటుపల్లి సీఎ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం అంగరంగ వైభవంగా జరిగిన ఈ సమావేశానికి జిల్లా పార్టీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం అధ్యక్షత వహించారు. ప్రారంభంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేశినేని మాట్లాడుతూ, తిరువూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా వైసీపీ గుండాల దౌర్జన్యాలకు టీడీపీ కార్యకర్తలు తగిన విధంగా స్పందించారని పేర్కొన్నారు. విజయవాడ నుంచి వచ్చిన వైసీపీ రౌడీలను ఎ.కొండూరులోనే అడ్డగించి పోలీసులకు అప్పగించామని చెప్పారు. తమ పార్టీకి చెందిన శాంతియుత కార్యకర్తలు ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తారని తెలిపారు.

**వైసీపీ నేతలపై విమర్శలు :**
జగన్ అండ్ బ్యాచ్ డ్రామాలు ఆడటంలో నిపుణులని ఎద్దేవా చేసిన ఎంపీ, కౌన్సిలర్లను దాచి కొత్త నాటకం ఆడి మళ్లీ పరాజయం పాలయ్యారని వ్యాఖ్యానించారు. తన పేరుతో బ్లూ మీడియాలో వచ్చిన ఫేక్ కంపెనీల వార్తలపై కూడా స్పందించిన ఆయన, "నాకు కంపెనీలు ఉన్నాయంటే, అవి ఎక్కడ ఉన్నాయో చెప్పండి" అని సూటిగా ప్రశ్నించారు. తాను జగన్ లాగా సూట్ కంపెనీలు పెట్టే అలవాటు లేదన్నారు.

**దేశరాజకీయాల్లో టీడీపీ కీలకపాత్ర :**
తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నదని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను పలు రాష్ట్రాలు అనుసరిస్తున్నాయన్నారు. "ఎన్టీఆర్ సంక్షేమానికి బాటలు వేస్తే, చంద్రబాబు అభివృద్ధికి బాటలు వేశారు" అంటూ కొనియాడారు. దేశంలో రెండు నదులను అనుసంధానించిన ఘనత సీఎం చంద్రబాబుకే చెందుతుందన్నారు. ఎన్టీఆర్ జిల్లా అభివృద్ధికి తనవంతు పాత్ర పోషిస్తున్నానని తెలిపారు.

## నీటి కోసం వారం రోజులుగా పోరాటం..

**- కొళాయిల వద్ద మహిళలు ఆందోళన**

**- మోటర్ పనికిరాక నీటి కొరత భగ్గుమన్న అంతర్ల పాతవీధి**

**- బురదనీటితో బతుకుల బోచన, అధికారులు స్పందించాలని గ్రామస్తుల విజ్ఞప్తి**



**చింతపల్లి, మే 22 (జనస్వరం) :** మండల కేంద్రానికి సమీపంలోని అంతర్ల పాతవీధిలో తాగునీటి కోసం గ్రామస్తులు, ముఖ్యంగా మహిళలు తీవ్ర తిప్పలు పడుతున్నారు. గ్రామంలోని నీటి మోటర్ మరమ్మతులకు గురికావడంతో కొళాయిలన్నీ శుష్కించిపోయాయి. వారం రోజులుగా తాగునీటి బిందెలు నిండక, ప్రజలు దూర ప్రాంతాల్లో ఉన్న పారుగడ్డలకు వెళ్లి బురద కలిసిన నీటిని తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ బురదనీటి వినియోగం వల్ల జలుబు, దగ్గు, జ్వరాలు వంటి ఆరోగ్య సమస్యలు ముదిరే అవకాశముందని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు ఇంటి పన్ను, నీటి పన్ను వసూలులో అధికార యంత్రాంగం మొండితనంగా వ్యవహరిస్తున్నా, ప్రాథమిక అవసర మైన తాగునీటి సమస్యపై మాత్రం పూర్తిగా అలసత్వం ప్రదర్శిస్తోందని విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. తీరికలేని గృహ బాధ్యతల నడుమ, మహిళలు రోజూ బకెట్లు, బిందెలు, బుట్టలతో కొళా యిల వద్ద గంటల తరబడి నీటి కోసం నిరీక్షణలో నిలబడుతున్న దృశ్యాలు భాధాకరంగా ఉన్నాయి. కొందరు మహిళలు కొన్ని కిలోమీటర్ల దూరంలోని చింతపల్లి జాతీయ రహదారి దాటి వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితిలో ఉన్నారు. ఇప్పటికే పలువురికి జలుబు, దగ్గు మొదలయ్యాయి. పరిస్థితి అదుపులోకి రాకపోతే వైద్యశాలలే మా గమ్యమవుతాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నీటి మోటర్ మరమ్మతులు పూర్తి చేసి, త్రాగునీటి సరఫరా పునరుద్ధరించాలని, గ్రామ ప్రజ ల ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## వైభవంగా కొవ్వలిలో హనుమాన్ జయంతి వేడుకలు





**దెందులూరు, మే 22 (జనస్వరం) :** మండలంలోని కొవ్వలి జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ వద్ద వేంచేసి ఉన్న శ్రీ భక్తాంజనేయ స్వామి వారి ఆలయం వద్ద హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ఉదయం విశేష అభిషేక పూజలతో పాటు పంచకుండాత్మక హనుమత్ కవచహవనం పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. తదానంతరం శ్రీ భక్తాంజనేయ కమిటీ వారు భక్తులందరికీ స్వామి వారి ప్రసాదాన్ని అందించారు.

## జూన్ 1 నుంచి 3 వరకు
## లమ్మసింగి రాకాసమ్మ దేవి తీర్థ మహోత్సవం

**గ్రామస్థుల, భక్తుల సహకారంతో వైభవంగా జరగనున్న మహోత్సవాలు**



**చింతపల్లి, మే 22 (జనస్వరం) :** ఆంధ్ర కాశ్మీర్‌గా పేరుగాంచిన లమ్మసింగిలో భక్తిరస ధారలు పారి పోనున్న వేళ సమీపిస్తోంది. గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ రాకాసమ్మ తల్లి జాతర మహోత్సవాలను జూన్ 1 నుండి 3 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. గత సంవ త్సరాలతో పోలిస్తే ఈ ఏడాది జాతరను మరింత ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. భక్తులు, పర్యాటకులు పెద్ద ఎత్తున హాజరయ్యే అవకాశముండటంతో భద్రతా పరంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కమిటీ వెల్లడించింది. జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు కల్పిస్తున్నామన్నారు. గ్రామం లో రద్దీ పెరగనున్న నేపథ్యంలో కొత్తగా వచ్చే వ్యక్తులపై గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ మహోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు గ్రామస్తులు, భక్తులు, ప్రేక్షకుల సహకారం అవసరమని కమిటీ కోరింది. రాకాసమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామానికి మరింత ప్రతిష్ఠలు చేకూరాలని ఆశిస్తూ, అందరూ కలిసి ఈ జాతరను సఫలీకృతం చేయాలని పిలుపునిచ్చారు.

## చిన్నబరడ గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పించండి

**జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బుజ్జిబాబు**



**చింతపల్లి, మే 22 (జనస్వరం) :** స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాల తరువాత కూడా తాగునీటి సమస్యతో బాధపడుతున్న చిన్నబరడ గ్రామానికి తక్షణమే తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు ఆధ్వర్యంలో గ్రామస్థులు ఎంపీడీఓ శ్రీనివాసరావును కలిసి లిఖితపూర్వక విజ్ఞప్తి చేశారు. చిన్నబరడ గ్రామంలో సుమారు 90 కుటుంబాలు జీవిస్తున్నప్పటికీ బుక్కెడి తాగునీటి ఇప్పటికీ అందుబాటులోకి రాకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. 2014లో నవనిర్మాణ సమితి ఆధ్వర్యంలో పెదబరడ, చిన్నబరడ గ్రామాలకు గ్రావిటీ కింద తాగునీటి పథకం అమలులోకి తెచ్చినప్పటికీ, ప్రస్తుతం ఆ నీరు కేవలం పెదబరడ గ్రామానికే సరిపోతుండటంతో చిన్నబరడకు సరఫరా నిలిచిపోయినట్టు గ్రామస్థులు తెలియజేశారు. ఈ విషయాన్ని ఎంపీడీఓ శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లిన బుజ్జిబాబు, తక్షణమే తాగునీటి సమస్య పరిష్కారం కావాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎంపీడీవో వీలైనంత త్వరలో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల ప్రధాన కార్యదర్శి రాజుబాబు, గ్రామస్తులు ధర్మ, శివ, రామకృష్ణ, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

## జనసేన సభ్యత్వం ప్రతీ ఒక్కరికీ గర్వకారణం

**- కార్యకర్తల్ని కంటికి రెప్పలా కాపాడుకునే నాయకుడు పవన్ కళ్యాణ్**

**- పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్**



**గుంటూరు, మే 22 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** దేశం పట్ల భక్తి, సమాజం పట్ల బాధ్యత, ప్రజలపై ప్రేమ కలిగి భవిష్యత్ తరాల బంగారు భవిత కోసం తనను తాను అంకితం చేసుకున్న పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పురుడు పోసుకున్న జనసేన పార్టీ సభ్యత్వం కలిగి ఉండటం ప్రతీ ఒక్కరికీ గర్వకారణమని జనసేన అగ్రనేత, రాష్ట్ర పౌర సరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాలు నాలుగు వందలు చేసిన సందర్భంగా జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరిని అయన అభినందించారు. పవన్ కళ్యాణ్ మేధోమధనం నుంచి ఏర్పడ్డ జనసేన సిద్ధాంతాలు ప్రజల్ని ఎంతగానో ఆలోచింప చేస్తున్నాయన్నారు. ఒక మూసలో కొట్టుకుపోతున్న రాజకీయాల్లో సమూల మార్పు తీసుకురావాలని మొదలైన జనసేన ప్రస్థానం నేడు దేశ రాజకీయాల్లోనూ తన ప్రభావాన్ని చూపించటం తెలుగుజాతికి గర్వకారణమన్నారు. నీతి, నిజాయితీ, నిబద్ధతలకు నిలువెత్తు రూపమైన పవన్ కళ్యాణ్ లాంటి నాయకులు అరుదుగా ఉంటారని కొనియాడారు. పార్టీ సిద్ధాంతాలూ, తన భావజాలం నచ్చి తన వెంట నడిచే కార్యకర్తలను వారి కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుకునే గొప్ప నేత పవన్ కళ్యాణ్ అన్నారు. దేశంలో ఏ పార్టీలో లేని విధంగా పార్టీ సభ్యత్వ నమోదుతో ఐదు లక్షల ప్రమాద భీమా పాలసీని తెచ్చిన పార్టీ ఒక్క జనసేనదేనంటూ పేర్కొన్నారు. గత వైసీపీ దుర్మార్గాలను క్షేత్రస్థాయిలో ధీటుగా ఎదుర్కుంటూ పార్టీ శ్రేణులు చేసిన పోరాటాలను ప్రజలెప్పటికి మరచిపోరన్నారు. కూటమి విజయంలో క్రియాశీలక సభ్యుల కృషి వెలకట్టలేనిదంటూ జనసైనికుల్ని, వీర మహిళల్ని నాదెండ్ల మనోహర్ ప్రశంసించారు.

## శ్రీశైలం జలాశయానికి వరద..



**శ్రీశైలం, మే 22 (జనస్వరం) :** తెలుగు రాష్ట్రాలపై ఏర్పడిన ద్రోణి ప్రభావంతో మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు, అనంతపురం జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో అన్ని చెరువులు, చిన్నపాటి రిజర్వాయర్లు నిండిపోవడంతో కర్నూలు జిల్లాలో ఉన్న ప్రాజెక్టులకు వరద వచ్చి చేరుతుంది. దీనికి తోడు ఐదు రోజులుగా కర్ణాటకలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా తుంగభద్ర నదికి భారీగా వరద నీరు చేరుతోంది. దీంతో కోసిగి మండలంలోని ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద వరద ఉధృతి పెరిగింది. ఈ క్రమంలో సుంకేసుల డ్యామ్ కు భారీ వరద వచ్చి చేరడంతో అప్రమత్తమైన అధికారులు బుధవారం సాయంత్రం 4 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో ఈ నీరు కృష్ణానదిలోకి ప్రవేశించడంతో.. శ్రీశైలం జలాశయానికి స్వల్పంగా వరద ప్రారంభం అయింది. దీనికి తోడు కృష్ణ నది పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో శ్రీశైలానికి వరద కొనసాగుతోంది. ప్రస్తుతం 21,666 క్యూసెక్కులు ఇన్ ఫ్లో వస్తున్నట్లు అధికారులు తెలిపారు. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం సాయంత్రం6గంటల సమయానికి నీటిమట్టం 817.20 అడుగులుగా నమోదైంది.

## ఎర్రమట్టి దొంగల నుండి గుట్టలను కాపాడండి

**తిరుపతి ఆర్డీఓకు సీపీఎం వినతి**



**తిరుపతి, మే 22 (జనస్వరం) :** చంద్రగిరి, రామచంద్రాపురం మండలాల్లో గుట్టను చదును చేసి ఎర్రమట్టి అమ్ముకుంటున్న దొంగలను, గుట్టను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ (సీపీఎం) ఆధ్వర్యంలో తిరుపతి ఆర్డీఓకు గురువారం వినతి పత్రం ఇచ్చారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు, డీవైఎఫ్ఐ అధ్యక్షుడు ఎస్.జయచంద్ర, తిరుపతి రూరల్ కార్యదర్శి కే సుమన్ ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో ఉండే పంచాయితీ కార్యాలయంలో అధికారులకు కూతవేటు దూరంలో ఉండే చంద్రగిరి ప్రభుత్వ బాయ్స్ హాస్టల్ దగ్గర 14, 79 సర్వే నెంబర్లలో మట్టిని తవ్వి వందల ట్రిప్పులు తీసుకెళ్తున్నారు. అధికారులకు ఎన్ని చెప్పిన ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. అదే విధంగా రామచంద్రాపురం మండలం రామాపురం నుండి పచికాపలం రోడ్డు వరకు కొండలన్నీ మాయమైపోయి ఎర్రమట్టి అమ్ముకుంటున్నా తహసిల్దారులు గాని ఏమి పట్టించుకోవడం లేదన్నారు. ఒక్కొక్క ఎర్ర మట్టి ట్రిప్పు రూ.30 వేలు అమ్ముకుంటున్నారు. అనేక సందర్భాలుగా అధికారుల దృష్టికి తీసుకుపోయిన ఏమాత్రం పట్టించుకున్న దాఖలాలు కనిపించట్లేదు. ప్రభుత్వ భూములను యదేచ్చగా కబ్జాకు గురి చేస్తున్నారు. గుట్టలు చదును చేసిన భూములన్ని అన్యాక్రాంతమవుతున్నాయి. ఎర్ర మట్టి దొంగలు అధికారులతో లాలూచి పడినారని సీపీఎం ప్రశ్నిస్తుంది. కాబట్టి తక్షణమే ఎర్రమట్టి తోలుతున్న దొంగలను, గుట్టల చదును చేస్తున్న కబ్జాదారులను అరెస్టు చేయాలని సీపీఎం డిమాండ్ చేస్తుంది. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని సీపీఎం నాయకులు పేర్కొన్నారు.

## జనసేన క్రియాశీలక సభ్యత్వ కిట్లు పంపిణీ

**- సర్వేపల్లి నియోజకవర్గంలో 3607 క్రియాశీలక సభ్యత్వాలు నమోదు**

**- 53 వాలంటీర్లతో కార్యచరణ**

**- జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు**



**సర్వేపల్లి, మే 22 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు సర్వేపల్లి నియోజకవర్గంలో క్రియాశీలక సభ్యత్వాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీకి దశాబ్ద కాలంగా గ్రామ స్థాయిలో అంకితభావంతో పనిచేస్తున్న జన సైనికుల కోసం, వారి కుటుంబాలను రక్షించాలన్న ఉన్నత ఉద్దేశంతో పవన్ కళ్యాణ్ ప్రారంభించిన క్రియాశీలక సభ్యత్వ కార్యక్రమం శ్లాఘనీయమని, ఈ సభ్యత్వం ద్వారా ప్రతి సభ్యుడికి ఐదు లక్షల రూపాయల ప్రమాద బీమా, అలాగే ప్రమాదంలో గాయపడిన వారికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50,000 అందే విధంగా చేయడం ద్వారా పార్టీ తాపత్రయాన్ని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 3607 క్రియాశీలక సభ్యత్వాలు నమోదయ్యాయి. వీటిని విజయవంతంగా ప్రచారం చేసి, ప్రజల్ని చైతన్య పరచడంలో 53 మంది క్రియాశీలక వాలంటీర్లు అహర్నిశలు శ్రమించారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి వారు చేస్తున్న సేవలు అభినందనీయం. ఇదే ఉత్సాహంతో ఇంకా ఎక్కువ మందిని పార్టీలోకి ఆహ్వానించి, బలమైన మద్దతును ఏర్పరచే దిశగా కృషి చేస్తామని తెలిపారు. "పవన్ కళ్యాణ్ భావజాలం నచ్చి, ఆయన నిజాయితీపై నమ్మకంతో పార్టీ కోసం పని చేస్తున్న వారిని ఎల్లప్పుడూ జనసేన పార్టీ ఆదరిస్తుంది. అలాంటి ప్రతి కార్యకర్తకు జనసేన గుండెల్లో చోటుంది," అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు, ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణి భవాని నాయుడు, పినిశెట్టి మల్లికార్జున్, ఐటీ టీం నుండి పసుపులేటి ప్రసాద్, ముత్తుకూరు మండల సీనియర్ నాయకులు రహీం, నారదాసు రవి, అశోక్, మస్తాన్, కిషోర్, చల్లా చెంచయ్య, మణి, గండు ఆనంద్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు టీటీడీ 'డయల్ యువర్ ఈవో' కార్యక్రమం

**తిరుపతి, మే 22 (జనస్వరం) :** పవిత్ర తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిర్వహిస్తున్న ప్రజలతో నేరుగా మాట్లాడే 'డయల్ యువర్ ఈవో' కార్యక్రమం శుక్రవారం (24వ తేదీ) ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు తిరుమలలోని అన్నమయ్య భవనంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తోంది. ఈ సందర్భంగా భక్తులు తమ సందేహాలు, ప్రశ్నలు, సూచనలను టీటీడీ ఈఓ శ్యామల రావుకు ఫోన్ ద్వారా నేరుగా తెలియజేయవచ్చు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ఫోన్ నెంబర్: 0877-2263261 సంప్రదించాలని తెలిపారు.

## బయోడైవర్సిటీ రక్షక అవార్డు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా సత్యనారాయణకు అందజేత




**చింతపల్లి, మే 22 (జనస్వరం) :** విశిష్ట పర్యావరణ సేవలకు గుర్తింపుగా గిరిజన వికాస్ సంస్థకు బయోడైవర్సిటీ రక్షక అవార్డు లభించింది. గురువారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన అంతర్జాతీయ బయోడైవర్సిటీ దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆ సంస్థ వ్యవస్థాపకుడు, కార్యదర్శి నెల్లూరి వెంకట సత్యనారాయణను శాలువాతో ఘనంగా సత్కరించి, అవార్డును అందజేశారు. గిరిజన వికాస్ సంస్థ రెండు దశాబ్దాలుగా చింతపల్లి, జి.కే. వీది, కొయ్యూరు మండలాల్లో పర్యావరణ పరిరక్షణ, సుస్థిర వ్యవసాయ పద్ధతుల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. నాబార్డ్ సహకారంతో గిరిజన రైతుల చేత పండ్ల తోటల అభివృద్ధికి దోహదం చేస్తూ, అల్లూరి సీతారామరాజు జిల్లాలో కాఫీ తోటలకు ఆర్గానిక్ సర్టిఫికేషన్ సాధనలో విశేష కృషి అందిస్తోంది. ఈ అవార్డును తన సిబ్బంది, గిరిజన రైతులు, తనకు సహకరించే ప్రతి ఒక్కరి సమష్టి కృషికి గుర్తింపుగా తీసుకునట్లు సత్యనారాయణ తెలిపారు.

# జగన్ రెడ్డికి ఎమ్మెల్యే పదవికి రాజీనామా సవాల్

### టీడీపీ నేతల మీడియా సమావేశం



**మంగళగిరి, మే 22 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** పులివెందుల ఎమ్మెల్యే జగన్ మోహన్ రెడ్డిపై టీడీపీ సీనియర్ నేతలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నక్కా ఆనంద్ బాబులు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వారు ఆయనను గట్టిగా సవాల్ చేశారు. సోమిరెడ్డి మాట్లాడుతూ, "ఉర్సాకు ఇడ్లీ, వడ ధరలకు భూములు కేటాయించామని జగన్ చేస్తున్న ఆరోపణలు అబద్ధాలే. జగన్ మాటల్లో ఒక్క వాక్యం కూడా నిజం లేదు. విశాఖ ఐటీ పార్క్‌లో భూములు మార్కెట్ ధరకు సమానంగా కేటాయించాం. ఎకరానికి రూ. కోటి, మరోచోట 56 ఎకరాలకు రూ. 50 లక్షల చొప్పున ఉన్నాయి. ఇది తెలుసుకోకుండా బెంగళూరులో విశ్రాంతి తీసుకుంటూ వచ్చినప్పుడు అబద్ధాలు చెబుతుంటారు" అన్నారు. అంతేగాక, "ఉర్సాకు రూపాయికే భూములు ఇచ్చారంటే నేను సర్వేపల్లి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. అది అబద్ధమైతే జగన్ తన పులివెందుల ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి" అంటూ సవాల్ విసిరారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేసిన జగన్, నేడు నీతి సూత్రాలు చెబుతుంటే వినలేకపోతున్నామన్నారు. సోమిరెడ్డి అభిప్రాయపడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చిన 11 నెలల్లో రాష్ట్రానికి రూ.4.95 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామన్నారు. ఇందులో రూ.3.19 లక్షల కోట్లు రాయలసీమకు వచ్చాయని వివరించారు. SIPB ద్వారా 4.55 లక్షల ఉద్యోగాల కల్పన జరిగిందని తెలిపారు. మద్యపాన నిషేధం పేరుతో కల్తీ మద్యం అమ్మిన ఘనత జగన్‌దేనని, ఆ మద్యం కారణంగా ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇప్పుడేమీ జరిగటం లేదని స్పష్టం చేశారు. జగన్ పాలనలో పోలవరం, అమరావతి ప్రాజెక్టుల విధ్వంసం జరిగిందని ఆరోపించిన సోమిరెడ్డి, తాము 2014-19 మధ్య కాలంలో నీటి ప్రాజెక్టులకు రూ.63,000 కోట్లు ఖర్చు చేసినప్పుడు, జగన్ ప్రభుత్వం కేవలం రూ.23,000 కోట్లు ఖర్చు చేసిందని పేర్కొన్నారు. వ్యవస్థలను నాశనం చేసి, కేంద్ర నిధులను దారి మళ్లించిన వ్యక్తికి ఏ హక్కు ఉందని ప్రశ్నించారు. నక్కా ఆనంద్ బాబు మాట్లాడుతూ, "జగన్ రెడ్డి ప్రెస్ మీట్‌లో చెప్పినది ఆయన నాయకత్వాన్ని కాపాడుకోవడానికి చేసిన ప్రయత్నం మాత్రమే. పార్టీ లేదు, నేతలు మాయమయ్యారు, తాను మాత్రమే ఉన్నట్టు చెప్పేందుకు రెండు గంటల పాటు మాట్లాడారు. అదే ప్రజలు నవ్వుకుంటున్నారు," అని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్ దేశంలో రెండో అతి పెద్ద వృద్ధిరేటు 8.2 శాతం సాధించిందన్న కేంద్ర గణాంక శాఖ నివేదికను జగన్ ఎందుకు చూసి మాట్లాడడం లేదని ప్రశ్నించారు. పోలవరం విషయంలో జగన్ విధ్వంసకరంగా వ్యవహరించాడని, డయాఫ్రమ్ వాల్ పూర్తిగా కొట్టుకుపోయేలా చేసిన దృష్టాంతాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం రూ. 800 కోట్లతో డయాఫ్రమ్ వాల్ మళ్లీ నిర్మిస్తామన్నారు. అమరావతిని అసెంబ్లీ సాక్షిగా రాజధానిగా అంగీకరించిన జగన్, అధికారంలోకి వచ్చాక మూడు ముక్కలాటలతో రాజధానిని విచ్ఛిన్నం చేశారని నక్కా విమర్శించారు. మైనింగ్ దోపిడీపై మాట్లాడే హక్కు జగన్‌కు లేదని, ఆయన కుటుంబమే ఓబులాపురం స్కాంలో ప్రధాన పాత్రధారులని ఆరోపించారు. పింఛన్ల పెంపు, గ్యాస్ సిలిండర్ పంపిణీ, తల్లికి వందనం వంటి పథకాలను కూటమి ప్రభుత్వం ప్రారంభించిందని గుర్తు చేస్తూ, జగన్ పాలనలో రోడ్లు పూడ్చే పని కూడా జరగలేదని విమర్శించారు. ప్రస్తుతం రూ. 1500 కోట్లతో రోడ్లు మరమ్మతు చేస్తున్నామని తెలిపారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్న నమ్మకం ప్రజల్లో ఉందని నక్కా తెలిపారు. పీ4 మోడల్‌తో రాష్ట్ర అభివృద్ధి దిశగా సాగిపోతుందని, అమరావతి, పోలవరాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. "జగన్ రెడ్డికి అభివృద్ధి జీర్ణించుకోవడం లేదు. కడుపు మంటతోనే విషం చిమ్ముతున్నాడు" అంటూ వ్యాఖ్యానించారు.

## విశాఖ బీచ్ రోడ్డులో రెండో రోజూ యోగాసనాలు



**విశాఖపట్నం, మే 22 (జనస్వరం) :** యోగాంధ్ర వేడుకల్లో భాగంగా రెండో రోజు గురువారం ఉదయం ఆర్.కె. బీచ్ వద్ద యోగాసన ప్రక్రియలు నిర్వహించారు. విశాఖపట్నం వేదికగా యోగా 'ఫర్ వన్ హెల్త్, వన్ ఎర్త్' నినాదంతో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని భారీగా నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. యోగాంధ్ర 2025కు విస్తృత ప్రచారం కల్పించడం, భారీ సంఖ్యలో ప్రజలను భాగస్వాములు చేసేందుకు నెల రోజుల కార్యాచరణ ప్రభుత్వం రూపొందించింది. ఇందులో భాగంగా జిల్లా యంత్రాంగం, ఆయుష్, క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో యోగాంధ్ర క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ క్యాంపెయిన్లో యోగా అభ్యాసకులు, శిక్షకులు యోగాసనాలు వేశారు. జిల్లా కలెక్టర్ ఎం. ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు బీచ్ రోడ్లో వేసిన ఈ స్టేజ్ నెల రోజులపాటు అలాగే ఉంటుందని, శిక్షకులు, అభ్యాసకులు నిత్యం యోగాసనాలు వేస్తారని డి.ఆర్.ఓ. భవానీ శంకర్ తెలిపారు.

## అభివృద్ధి పనుల్లో స్థానిక ప్రజలందరూ భాగస్వామ్యం కావాలి

**- నెల్లూరు రూరల్ లో అభివృద్ధి పనుల జాతర ఇంకా కొనసాగుతుంది**

**- రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి**



**నెల్లూరు, మే 22 (జనస్వరం) :** రూరల్ నియోజకవర్గం పరిధిలోని 24వ డివిజన్ కల్లూరుపల్లి అరుంధతీయవాడ రూ.41 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 నెలల కాలంలో 24వ డివిజన్ అభివృద్ధికి 5 కోట్ల 60 లక్షల రూపాయలు నిధులు కేటాయించామని తెలిపారు. ఈ రోడ్లను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందిస్తామని అన్నారు. అభివృద్ధి పనులలో స్థానిక ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య, క్లస్టర్ ఇంచార్జీ కనపర్తి గంగాధర్, స్థానిక కార్పొరేటర్ ఆరవ శాంతి, కో క్లస్టర్ ఇంచార్జీ కుల్లూరు రాఘవేంద్ర, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎస్.సి. సెల్ అధ్యక్షులు ఆరవ శ్రీను, 24వ డివిజన్ అధ్యక్షులు గుండాల రవి, సలీమ్, శ్రీధర్ రెడ్డి, వేల్పుల అజయ్, సుబ్రహ్మణ్యం, సుమన్, శ్రీకొలను శ్రీనివాసులు రెడ్డి, అశోక్ రెడ్డి, సుధాకర్, మస్తాన్, యాదగిరి, పెంచలయ్య, సుధాకర్, ఉడతా సుధాకర్, మీరయ్య, ప్రభాకర్ రెడ్డి, చిట్టి బాబు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.


## అంతర్జాతీయ సైబర్ నేరగాళ్ల ముఠా అరెస్టు






**అనకాపల్లి, మే 22 (జనస్వరం) :** అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో భారీ స్థాయిలో జరుగుతున్న అంతర్జాతీయ సైబర్ క్రైం కార్యకలాపాన్ని అనకాపల్లి జిల్లా పోలీసులు, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ ఆధ్వర్యంలో, గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్ఓ) నివేదిక ఆధారంగా, సమగ్ర ఇంటెలిజెన్స్ ఆధారంగా ఛేదించారు. అమెరికా పౌరులను లక్ష్యంగా చేసుకుని, ప్రధానంగా అమెజాన్ కస్టమర్ సపోర్ట్‌గా పూజించటం ద్వారా మోసాలకు పాల్పడుతున్న ఈ ముఠా, అభివృద్ధిశీల టెక్నాలజీని ఉప యోగించి మానసిక వంచనలకు పాల్పడుతూ భారీగా డబ్బు దోచుకుంది. మొత్తం 33 మందిని ఘటన స్థలంలో అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరు పరిచారు. అచ్యుతాపురంలోని మూడు ముఖ్య కేంద్రాల్లో ఒకేసారి ఆకస్మిక దాడులు జరిగాయి. అనేక కంప్యూటర్లు, నెట్‌వర్క్ పరికరాలు, డిజిటల్ సదుపాయాలు, రూ.3 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. అనేక వాహనాలు, ఫర్నిచర్, కేంద్రాల ను నివాసాలు, శిక్షణా కేంద్రాలుగా ఉపయోగించే సదుపాయాలు గుర్తింపు. దాడిలో తక్కువ అనుభ వం ఉన్న ట్రైనింగ్‌లో ఉన్న కొత్త ఉద్యోగులూ ఉన్నట్లు ధృవీకరణ. ఇద్దరినీ అరెస్ట్ చేశారు. ముఠాకు మద్దతిచ్చే టాప్ లెవెల్ వ్యక్తులను గుర్తించేందుకు విచారణ కొనసాగుతోంది. అనకాపల్లి జిల్లా పోలీ సులు, సైబర్ ఫోరెన్సిక్ నిపుణుల సహకారంతో దర్యాప్తును తీవ్రంగా కొనసాగిస్తున్నారు. ముఠాలో ఉన్న సమగ్ర హెరార్కీని గుర్తించేందుకు, ఆర్థిక మరియు డిజిటల్ ఆధారాలను అన్వేషించేందుకు, అంతర్జాతీయ సంబంధాల సహా ప్రధాన మద్దతుదారులను పట్టుకునేందుకు చర్యలు తీసుకుం టున్నారు. ఈ మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ తో పాటు అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, ఈ కేసు దర్యాప్తులో భాగం పంచుకున్న పరవాడ డిఎస్పీ వి.విష్ణు స్వరూప్ మరియు అచ్యుతాపురం ఎస్.హెచ్.ఓ ఎన్. గణేష్, ఐ.టి కోర్ ఎస్సై సురేష్ బాబు, ఇతర జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించారు.

## హనుమాన్ జయంతి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే




**యలమంచిలి, మే 22 (జనస్వరం) :** నియోజకవర్గంలోని మునగపాక మండలంలో గురువారం హనుమాన్ జయంతి కార్యక్రమాల్లో మునగపాక, నాగులపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పాల్గొని ఆంజనేయ స్వామిని దర్శించుకొని అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని తన స్వహస్తాలతో వడ్డించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురాం, దాడి ముసలి నాయుడు, ఎల్లపు భాస్కరరావు, ఉప సర్పంచ్ గోసాల గోవింద్, ఆడారి గణేష్, దొడ్డి రమేష్ సరగడం నాగేశ్వరరావు పొలమరశెట్టి మురళి, పొలమరిశెట్టి నవీన్, కొయ్య శేషు, కుర్రి సరోజిని, ఆడారి గోవింద్, సరగడం జగన్ తదితరులు పాల్గొన్నారు

## చంద్రబాబు సీఎం కావాలని పాటుపడ్డా

**- తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్**

**- పల్లా శ్రీనివాస్ అనర్హుడు, సెటిల్మెంట్లకే పరిమితమయ్యాడు**

**- సీఎం చంద్రబాబు దీనిపై దృష్టి పెట్టాలి**




**విశాఖపట్నం, మే 22 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** ఇటీవల తనపై జరిగిన దాడికి సంబంధించి తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ గురువారం ఉదయం విశాఖపట్నంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సూక్ష్మ, చిన్న, మధ్య పరిశ్రమ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ టి.శివ శంకర్‌ను కలిసి వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పల్లా శ్రీనివాస్ పార్టీకి తలకిందులైన పనులు చేస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగేతర శక్తిగా మారి సెటిల్మెంట్లు, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పార్టీకి ఎటువంటి ఉపయోగం లేకుండా, కేవలం స్వలాభం కోసమే పల్లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర అధ్యక్ష పదవికి పూర్తిగా అనర్హుడైన పల్లా, కబ్జాలు, సెటిల్మెంట్లకు తప్ప ఇంకేమీ చేయలేడన్నారు. చంద్రబాబు నాయుడు దీనిపై తక్షణమే స్పంది ంచి చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్ భారతి మీద ఒకరు కామెంట్ చేస్తే వెంటనే చర్యలు తీసు కున్న ప్రభుత్వం, తనపై వందమంది దాడి చేసినా ఎందుకు చిత్తశుద్ధిగా స్పందించలేదని ప్రశ్నిం చారు. పదవి కోసం తాను ఏనాడూ పాకులాడలేదని, కేవలం చంద్రబాబు నాయుడు సీఎం కావా లని పాటుపడ్డానని స్పష్టం చేశారు. తెలుగుదేశం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ అత్యంత ప్రమాదకరుడని, రాజకీయాలను వ్యక్తిగత లాభాలు కోసం వాడుకుంటున్న వ్యక్తి అని ఆరోపించారు. 2019 గాజువాక ఎన్నికల సమయంలో పవన్ కళ్యాణ్‌ను ఓడించేందుకు నాగిరెడ్డితో కలిసి పల్లా కుట్రపన్నారని, "నాకు ఓటమి వచ్చినా పర్వాలేదు కానీ పవన్ గెలవకూడదు" అనే నీచ ఆలోచనతో వ్యవహరించా డని చెప్పారు. మొదటి నుంచి పల్లా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, తెలుగు దేశం పార్టీ మీద తనకు అభిమానం ఉందని, చంద్రబాబు అంటే తనకు ఎంతో గౌరవమని . తన పోరాటం పూర్తిగా పల్లా శ్రీనివాస్‌పై వ్యక్తిగత పోరాటమేనని, పార్టీలో ఇటువంటి వ్యక్తులు ఉండకూడదనే ధృఢసంకల్పంతో తాను పోరాడుతున్నానన్నారు. పల్లా శ్రీనివాస్‌పై హత్యయత్నం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్న డిమాండ్‌తో పోరాటాన్ని కొనసాగిస్తానన్నారు. తనను హత్య చేయా లని ప్రయత్నించారని, అందుకు పలు ఆధారాలున్నాయని, ప్రభుత్వం ఈ దాడిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. దాడి జరిగిన చోట ఉండే వీడియో ఆధారాలను ప్రభుత్వం సేకరించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జనసేన నేత టి.శివ శంకర్ తనకు మద్దతుగా నిలిచారని వెల్లడించిన బి.వి.రామ్, ఇది పార్టీ వ్యతిరేకత కాదు, పార్టీని రక్షించేందుకు తన పోరాటమని స్పష్టంచేశారు.

## తిరుపతిలో "నియోజకవర్గ మహానాడు"



**తిరుపతి, మే 22 (జనస్వరం) :** తిరుపతి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్, రాష్ట్ర గ్రీనరి అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్ పర్సన్ మన్నూరు సుగుణమ్మ ఆధ్వర్యంలో గురువారం మహానాడు వైభవోపేతంగా జరిగింది. తిరుపతి కపిలతీర్థం వద్ద ఉన్న టీడీపీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ మహానాడుకు "తుడ" చైర్మన్ డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్, నగర అధ్యక్షుడు దంపూరు భాస్కర్, ఊకా విజయ్ కుమార్, గుణశేఖర్ నాయుడు, ఊట్ల సురేంద్ర నాయుడు, మున్సిపల్ డిప్యూటీ మేయర్ ఆర్.సి. మునికృష్ణ, కంకణాల రజనీకాంత్, లీగల్ సెల్ అధ్యక్షుడు దినకర్ రాయల్, సంజయ్ రాయల్, జంగం తులసీ రాయల్, మునిశేఖర్ రాయల్, వందలాది నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం అన్నదానం నిర్వహించారు.

## నీలవర్ణ మబ్బులతో చింతపల్లి ఆకాశం కళాత్మక దృశ్యంగా మార్పు



**చింతపల్లి, మే 22 (జనస్వరం) :** సాయం సంధ్యా వేళ చింతపల్లి పర్వత ప్రాంతం అందాల వేదికగా మారింది. నెమ్మదిగా చీకటి కమ్ముకుంటున్న వేళ ఆకాశాన్ని అలంకరించిన నీలవర్ణ మబ్బులు, పర్వత శ్రేణులపై తేలియాడుతున్నట్టుగా కనిపిస్తూ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ మబ్బుల ఊగిసలాటతో కలిసిన ఆకాశపు నీలిమ, అక్కడి ప్రకృతి అందాన్ని మరింత మెరుగుపరుస్తూ, ఫోటోగ్రాఫర్లు, ప్రకృతి ప్రేమికులకు చూపుల విందుగా నిలిచింది. అలాంటి ప్రత్యేక క్షణాల్లో కనిపించే రంగుల హార్మనీ, చింతపల్లికి ఒక తురిపిరాని గుర్తుగా మారింది. ఇటీవల వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల నేపథ్యంలో ఇలాంటి ప్రకృతి దృశ్యాలు తరచుగా కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా మారుతోంది. శాంతంగా పరవళ్లు తొక్కుతున్న ఆ మబ్బుల ఛాయల్లో తడిసి ముద్దైన పర్వత నోటలు, ఆ క్షణాన్ని (చింతపల్లి జనస్వరం కెమెరాకు) చిక్కి కలలో భాగమయ్యేలా మలచాయి.

## ఏలూరులో ఘనంగా హనుమాన్ జయంతి శోభాయాత్ర బైక్ ర్యాలీ

**- శోభాయాత్రను ప్రారంభించిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, సత్యానందగిరి స్వామీ**





**ఏలూరు, మే 22 (జనస్వరం) :** ఏలూరులో హనుమాన్ జయంతి సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. మొదట రామ కోటి వద్ద భారీ హనుమంతుని ప్రతిమను, ప్రత్యేకంగా పూలతో అలంకరించి రథంపై పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శోభయాత్రను బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారా మాంజనేయ చౌదరి,మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ శోభాయాత్ర బైక్ ర్యాలీ ఓల్డ్ మార్కెట్, చందనా బ్రదర్స్ సెంటర్, టూ టౌన్ ఏరియా, ఫైర్ స్టేషన్ సెంటర్ మీదిగా సాగి రామకోటికి చేరుకుంది. పెద్ద ఎత్తున హనుమాన్ భక్తులు బైక్ ర్యాలీలో పాల్గొని జై హనుమాన్ జై జై హనుమాన్ అంటూ కాషాయ జెండాలు చేతపూని నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు. ఈ సందర్భంగా గారపాటి చౌదరి మాట్లాడుతూ హనుమంతుని మాదిరిగా అవసరమైనప్పుడు శక్తి ప్రద ర్శన చేయాలనీ, ఇటీవల ఉగ్రవాది శిబిరాలపై భారతదేశం ఆపరేషన్ సింధూర్ పేరుతో దాడులు నిర్వహించి మన శక్తి సమాజాలు ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు. కులాల వారీగా విడిపోకుండా ప్రతి హిందు బంధువు అనే విధంగా కలిసిమెలిసి ఉండాలని, మన ధర్మాన్ని ఆచరిస్తూ ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్య క్షులు కాకి సురేష్, నగర కన్వీనర్ గడ్డం నాగరాజు, బీజేపీ నాయకులు చౌటపల్లి విక్రమ్ కిషోర్, కట్నేని కృష్ణ ప్రసాద్, ప్రాంత వివేకానంద కేంద్ర నిర్వాహకులు సదాశివ, సత్యానందగిరి స్వామీ, చౌటపల్లి విక్రమ్ కిషోర్, కట్నేని కృష్ణ ప్రసాద్, నెక్కంటి శ్రీనివాస్, పెద్ద సంఖ్యలో వివిధ హిందూ సంఘాల ప్రతినిధులు, యువకులు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

## దర్భగూడెం గ్రామంలో ఎమ్మెల్యే స్వంత ఖర్చులతో బోరు



**జీలుగుమిల్లి, మే 22 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** మండలంలోని దర్భగూడెం పంచాయతీలో ఏళ్లుగా వున్న మంచినీటి సమస్యకు పరిష్కారం చూపిస్తూ పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఉదార హృదయతను చాటుకున్నారు. గ్రామస్తుల దాహార్తిని తీర్చేందుకు తన సొంత ఖర్చుతో సుమారు రూ.5 లక్షలు ఖర్చు చేసి బోరుబావిని తవ్వించారు. గురువారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఈ బోరును ఎమ్మెల్యే బాలరాజు గ్రామస్తుల సమక్షంలో ప్రారంభించారు. బర్రింకలపాడు పరిధిలోని దర్భగూడెంలో మంచినీటి కొరతను గుర్తించి వెంటనే స్పందించిన ఎమ్మెల్యే చర్యపై గ్రామస్థులు హర్షాతిరేకాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ, "ఏళ్లుగా నీటి కోసం ఎన్నో ఇబ్బందులు పడ్డాం. ఎమ్మెల్యే తక్షణమే స్పందించి స్వంతంగా ఖర్చు పెట్టి మాకు నీళ్లు అందించడమంటే నిజమైన ప్రజాప్రతినిధి అని చాటుకున్నారు" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కన్యకాపరమేశ్వరిని దర్శించుకున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**కోవూరు, మే 22 (జనస్వరం) :** హనుమ జయంతి సందర్భంగా నగరంలోని స్టోన్ హౌస్ పేటలో ఉన్న కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా ఆత్మీయ స్వాగతం పలికారు. పుష్పాలంకారంతో ప్రత్యేకంగా ముస్తాబు చేసిన హనుమంతుల వారి విగ్రహాన్ని ఆమె దర్శించుకున్నారు. అనంతరం కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ముంగమూరు చైతన్య రెడ్డి, ఆడపాల అనీష్ రెడ్డి పాల్గొన్నారు.